ఆదివారం

ప్రజాశక్తి

డిసెంబర్ 21, 2003



సద్దాం
అంటేనే పోరాటం





నిత్య నూతన కథా నాయకుడు
దేవానంద్

హ్యాపీ బర్త్‌డే

(21-12-2003 నుండి 27-12-2003వరకు)

దేదీప్య
2సం॥,21.12.2001
శారద-ప్రసాద్
విజయనగరం



సూర్యతేజ
2సం॥,21.12.2001
లక్ష్మీ-రామోహణరావు
కురుపాము-విజయనగరం

రాహుల్
3సం॥,21.12.2000
జ్యోతి-రాజగోపాలరాజు
కాకానినగర్-విశాఖపట్నం

సాయికిరణ్
8సం॥, 21.12.1995
ఉపేంద్ర-పాపయ్య
ఊర్నకల్-వరంగల్

సుస్మిత
3సం॥,22.12.2000
సువర్ణ- అంబన్నీచారి
గోరెబాళ్-కర్నాటక (రాష్ట్రం)

యం.నివేదిత
నిర్మల-సుధీర్‌కుమార్
ఆదిలాబాద్

చాందిని
6సం॥,22.12.1997
రహమత్‌బి
వినాయకపురం- చిత్తూరు

ఎస్. స్నేహ(కళ్యాణి)
డిసెంబర్-22
బాగ్యమ్మ-సతీష్
కొత్తకోట-మ॥నగర్

అఫ్షాన్
డిసెంబర్-22
అమేనా-ఆజాద్
నవలాకుతోట-నెల్లూరు

కె. విశ్వక్
2సం॥, 22.12.2001
మంగా-శంకర్
నర్సాపూర్-మెదక్

ఎస్. సంధ్య
8సం॥, 23.12.1995
నాగరత్న-బాలనరసింహారెడ్డి
సోమనాథ్‌నగర్-అనంతపురం

ఎస్.బి.శివకుమార్
6సం॥, 23.12.1997
ఎల్.కె.డి. భవానీ-వి.వి.రఘువయ్య
చీడిగ-కాకినాడ

జి.రాల్ఫ్
1సం॥, 24.12.2002
బ్యూలా-శ్యాంబాబు
మార్కాపురం-ప్రకాశం

కీర్తన
5సం॥, 24.12.1998
దీవనమ్మ-ఆంజనేయులు
శాంతినగర్-అనంతపురం

ఎర్నకుమార్
1సం॥, డిసెంబర్-2002
వరలక్ష్మీ-అర్జునరావు
పెందుర్తి-విశాఖ

కె. శకేత్‌రాం
అనుపమ-సునీల్
పంజగుట్ట- హైదరాబాద్

ఎం. మణిప్రకాష్
9సం॥, 23.12.1994
లైలా-శ్యామ్
ఆకివీడు

జి. కృష్ణవేణి
9సం॥, 27.12.1994
వజ్రమ్మ-బాలరాజు
హరిజనవాడ-వనపర్తి

లైఫ్‌అహ్మద్-ఖదీర్‌అహ్మద్
షాహిదా-బషీర్
నెల్లూరు

ఇ.గీతాంజలి
10సం॥,డిసెంబర్-1993
శారద- రాజ
కామాటావీది-నెల్లూరు

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

ముచ్చటైన ముఖచిత్రాలు

ముచ్చటైన ముఖచిత్రాలతో పసందైన శీర్షికలతో డిసెంబర్ 7వ తేదీ ఆదివారం ప్రజాశక్తి, పాఠకులకు పఠనాసక్తిని పెంచేదిగా ఉంది. సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు అవసరమైన అంశాలు ఇందులో పొందుపరచి మనలో మాట నుండి రుచి పేజీవరకు వదలకుండా చదివేలా పత్రికను తీర్చి దిద్దుతున్నందుకు ధన్యవాదాలు. రాష్ట్రంలోని జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రాల గురించి మరింత వివరంగా వ్యాసాలు అందించండి. ప్రతి పేజీలోనూ ఒక కార్టూను ఉండేవిధంగా చూడండి.

డాక్టర్ కె ఎల్ వి ప్రసాద్
హనుమకొండ

కాఫీ కథ బాగుంది

కాఫీ పుట్టుపూర్వోత్తరాలు తెలిపే కాఫీకథ కవర్ స్టోరీ బాగుంది. కాఫీ తాగడమే గాని దాని గురించి తెలియని పాఠకులకు మంచి సమాచారం అందించారు. కాఫీలో ఎన్ని రకాలు ఉంటాయో, అవి ఎలా కాస్తారో కూడా తెలిపి ఉంటే మరింత బాగుండేది. అయినా మంచి సమాచారం ఇచ్చినందుకు ధన్యవాదాలు.

వి. అచ్యుత్
మణుగూరు

రెండు అంతర్లోకాలు

సమాజంలోని ధనిక, పేద తారతమ్యాలు, వారి ఆలోచనల ప్రతిబింబాలుగా జయంతి పాపారావు రాసిన రెడు అంతర్లోకాలు కథ చాలా బాగుంది. సెల్ ఫోన్ల యాతనల గురించి సుజాతరెడ్డి గారు రాసిన సెటైర్ ఆకట్టుకుంది. సెల్ ఫోన్లతో తమాషాలు చేసేవారు తర్వాత ఎన్ని ఇబ్బందులు పడతారో చక్కగా తెలియచేశారు.

కె. సుజాత
చిట్టినగర్, విజయవాడ

మిరపవీరుడు

మిరపచెట్టు పెంచిన వీరుడుగా గిన్నిస్ పుస్తకంలో ఎక్కిన ప్రభుత్వ అధికారి గురించి రియల్ స్టోరీలో రాసిన విధానం ఆసక్తికరంగా ఉంది. అనుకోకుండా అనూహ్యంగా ఎత్తు పెరుగుతున్న మిరపచెట్టుకు పోషణ చేసి గిన్నిస్‌బుక్‌లో ఎక్కిన నందూరి శరగోపన్ నిజంగా అభినందనీయుడు. ఆదిలాబాద్ జిల్లాలోని పర్యాటక కేంద్రాల గురించి టూరిస్ట్ గైడ్‌లో సంక్షిప్తంగా ఇచ్చిన సమాచారం చాలా ఉపయోగంగా ఉంది. ఇదే విధంగా వారం వారం ఒక్కో జిల్లా గురించి టూరిస్ట్ గైడ్‌లో వివరించగలరు.

పి. గంగాధర్, నిజామాబాద్

దంతాల ఆరోగ్యం పట్ల అవగాహన

డిసెంబర్ ఏడవ తేదీ ఆదివారం పుస్తకంలో దంతాల ఆరోగ్యం గురించి రాసిన వ్యాసం ఆ సమస్యపట్ల అవగాహన కలిగించింది. దంతాల పట్ల నిర్లక్ష్యం వహించేవారికి ఇది ఒక చక్కని సూచన. ఇటువంటి ఉపయోగకరమైన వ్యాసం రాసిన డాక్టర్ ప్రసాద్ గార్కి ప్రచురించిన ఆదివారం ప్రజాశక్తికి ధన్యవాదాలు.

వి. శివనాగేశ్వరరావు
తెనాలి

గమనిక

ఆదివారం అనుబంధంలో రుచి శీర్షిక మీరు చూసే ఉంటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తిలో ప్రచురిస్తాము. వంటకం ఫోటోతో పాటు రాసిన వారి ఫోటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా: రుచి, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

మనలో మాట

ప్రశ్నించకపోతే ఏమవుతుంది?

అవును ప్రశ్నిస్తే ఏమవుతుంది? అసలు ఎందుకు ప్రశ్నించాలి?

ఈ సందేహమే ఫ్రెండ్‌కి వచ్చింది.

ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు సమ్మె చేయవచ్చా? అంటూ వాదనకు దిగాడు. అవును సమ్మె చేయవచ్చు. వాళ్ళు చేసే సమ్మె ప్రాణాలు కాపాడటానికే, పేదలకు రాబోయే ముప్పు తప్పించడానికే మరి.

ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి ఆస్పత్రులు నిర్మిస్తుంటే మధ్యలో ఈ సమ్మెలెందుకట? మరో ధర్మ సందేహం!

ఆస్పత్రులు నిర్మించాల్సిందే. అవి ప్రజలకు చాలా అవసరం, అది ప్రభుత్వ బాధ్యత కూడా.

కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన ఆస్పత్రులు ప్రయివేటు వారికి అప్పగించవద్దనే డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. అన్నదే గాని ఇంకా ప్రయివేటు చేయలేదుగా అయినా ప్రభుత్వం అనేక నిర్ణయాలు చేస్తుంది, వాటిని ప్రశ్నించే అధికారం డాక్టర్లకెక్కడిది? ఫ్రెండ్ వితండ వాదన మొదలుపెట్టాడు.

ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది ప్రజలు, వారికి అధికారం ఇచ్చింది మంచి పరిపాలన చేయడానికి, నచ్చకపోతే ఎంతటి ప్రభుత్వాన్నైనా దించడానికి కూడా ప్రజలకు అధికారం ఉంది. అందుకని ప్రభుత్వం చేసే తప్పుడు నిర్ణయాలను ఎదిరించే, ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది- డాక్టర్లు కూడా ప్రజల్లో భాగమే గనుక, వారి చదువులకు కూడా కష్టం రానుంది గనుక సమ్మె చేసే హక్కు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు వారికి ముమ్మాటికీ ఉంది.

ఏదో యూజర్ ఛార్జీలు వసూలు చేస్తున్నంత మాత్రాన ఆస్పత్రులన్నీ ప్రయివేటు వారికి అప్పగించేస్తారా? ఫ్రెండ్ ప్రశ్నించాడు.

ఇలా మంచిగా చెప్పడం, బుజ్జగించడం ఈ పాలకులకు వెన్నతో పెట్టిన విద్య.

విద్యుత్ సంస్కరణలపుడు కూడా మంచి విద్యుత్, కారుచౌకగా వస్తుందని నమ్మబలికారు. ఎన్నికల ముందు ఛార్జీలు పెంచను గాక పెంచనని అందరు దేవుళ్ళ మీద ప్రమాణం చేసి మరీ చెప్పారు. తర్వాత ఏమి జరిగింది?

కనుక ఈ ప్రభుత్వాన్ని నమ్మడానికి వీల్లేదు. అవసరమైనపుడు ప్రశ్నించాల్సిందే. పోరాడాల్సిందే.

ఇవ్వాళ యూజర్ ఛార్జీలతోనే ప్రారంభమైంది- రేపు ఆస్పత్రులను ప్రయివేటు వారికి అప్పగించేస్తారు. ఆ తర్వాత పేదవాళ్ళు ఎక్కడికి వెళతారు? స్టార్ ఆస్పత్రుల గేటు దగ్గరకైనా వీళ్ళను రానిస్తారా?

తెల్లకార్డులు ఉన్నవారికి వాటిల్లో ఉచిత వైద్యం చేస్తారుగా? ఫ్రెండ్‌కు మళ్ళీ సందేహం వచ్చింది. అవును తెల్లకార్డులు ఉన్నవారి పేరు చెప్పుకుని పెద్దమంత్రి ఆఫీసులో అధికారులు, స్టార్ ఆస్పత్రులూ బాగు పడతాయి గాని పేదరోగులకు వైద్యం అందదు.

అందుకని

ముందుగా జాగ్రత్త పడకపోతే ఇక రాష్ట్రంలో

పేదరోగులకు వైద్యం అందదు. తస్మాత్

జాగ్రత్త!

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం...	. . . 4
ఓరా!	. . . 5
కవర్ స్టోరీ	. . . 6
రియల్‌స్టోరీ	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
టూరిస్ట్ గైడ్	. . . 21
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

యాది(కొచ్చిందు)
కథ ... 9

శరీర సౌష్ఠవానికి- ఆకృతికి
వ్యాయామం
ఆరోగ్యం . . . 18



అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మెదక్ చర్చి
టూరిస్ట్ గైడ్ . . . 21



అక్షర విజేత
అడిగోపుల వెంకటరత్నమ్
కళాసాహితి . . . 22

* టి. శ్రీనివాసరావు

సద్దాం అంటేనే పోరాటం...

సద్దాం.. ఈ పేరే పోరాటానికి పర్యాయపదం. దశాబ్దానికి పైగా అమెరికా సామ్రాజ్యవాదుల కంటి మీద కునుకు లేకుండా చేసిన ఇరాక్ అధ్యక్షుడి పేరే సద్దాం హుస్సేన్. దురాక్రమణ దళాలు చేసిన అధర్మయుద్ధంలో అధికారం కోల్పోయి అజ్ఞాతంలో ఉన్న సద్దాంను బంధించిన అమెరికా దళాలు పండుగ చేసుకుంటున్నాయి.

ఇపుడు ఆయనపై విచారణ ఎలా జరగాలన్నదానిపై వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇరాక్ అధ్యక్షుడిగా సద్దాం 25 సంవత్సరాలు పని చేశాడు. దురాక్రమణదళావలు ఇరాక్‌ను ఆక్రమించుకున్ననాటి నుండి తప్పించుకు తిరుగుతున్న ఆయన్ని డిసెంబర్ 13న స్వంత పట్టణం తిక్రిత్ సమీపంలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో అరెస్ట్ చేశారు.. సద్దాం జీవితమంతా పోరాడుతూనే ఉన్నాడు. గొర్రెల కాపరి కొడుకు అయిన సద్దాం ఎక్కువ కాలం మేనమామ ఖయిరల్లా తుల్ఫా వద్దే పెరిగాడు. సాహసం, ధైర్యం తుల్ఫా నుండే నేర్చుకున్నాడని చెబుతారు.

ఇరాక్‌లోని తిక్రిత్ జిల్లా అల్ అవ్ జా గ్రామంలో 1937 ఏప్రిల్ 28న జన్మించాడు. తల్లి పేరు శుభ తుల్ఫా అల్ మసలట్, తండ్రి హుసేన్ అబ్దుల్ మజార్. సద్దాం పూర్తి పేరు సద్దాం హుస్సేన్ అబ్దుల్ మజీద్ అల్ తిక్రిత్. 1955లో బాగ్దాద్‌లో స్కూల్‌లో చేరాడు. స్కూల్‌లో చేరిన రెండో సంవత్సరమే బాత్ పార్టీలో చేరి చురుకుగా పని చేశాడు. నాయకత్వ లక్షణాలు ఉండడంతో అనతి కాలంలోనే అందరి దృష్టిని ఆకర్షించగలిగాడు. ఈజిప్ట్‌లోని కైరోలో కూడా చదివిన సద్దాం, బాగ్దాద్ యూనివర్శిటీ నుండి లా డిగ్రీ పొందాడు. 1958లో ఇరాక్ రాజుపై తిరుగుబాటు జరిపిన ఖసిం హల్లా అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. 59లో ఖసిం హత్యకు గురయ్యాడు. ఈ హత్యలో సద్దాం పాత్ర కూడా ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ హత్య తరువాత కొంత కాలం సిరియాలో అజ్ఞాత వాసం గడిపి సద్దాం 1968లో ఇరాక్ వచ్చాడు. అదే సంవత్సరం ఆయన బాత్ పార్టీ రివల్యూషనరీ కమాండ్ ఉపాధ్యక్షుడిగా నియమితుడయ్యాడు. అక్కడి నుండి ఆయన అధికార సోపానం ప్రారంభమైంది. అదే సంవత్సరం బాత్‌పార్టీ అధికారంలోకి ఇచ్చింది. పార్టీలో అనైక్యత మూలంగా ఎనిమిది నెలల కాలంలోనే ప్రభుత్వం పతనం అయ్యింది. ఈ అనుభవాన్నే గుణపాఠంగా తీసుకున్న సద్దాం తరువాత కాలంలో పార్టీలో ఉక్కు క్రమశిక్షణను నెలకొల్పాడు. 1979లో ఇరాక్ అధ్యక్షుడైన సద్దాం అమెరికా కుట్రల మూలంగా పదవి నుండి తొలగించబడ్డాడు.

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అరబ్ ప్రపంచంలో నికరంగా నిలబడి పోరాడిన వ్యక్తి సద్దాం. గల్ఫ్‌లో తిష్ట వేయడం ద్వారా అపారమైన చమురు సంపదపై పట్టుసాధించాలన్న అమెరికా కుతంత్రాలను ధైర్యంగా అడ్డుకున్నవాడు సద్దాం. గల్ఫ్‌ను నిత్య అగ్నిగుండంగా మార్చిన అమెరికా కుట్రలో సద్దాం కూడా చిక్కుకుని, త్వరగానే దాన్నుండి బయటపడ్డాడు. ఇరాన్-ఇరాక్ యుద్ధంలో అమెరికా, బ్రిటన్‌లు సద్దాంకు అన్ని రకాలుగా అండదండలు ఇచ్చాయి. ఆయుధాలతో పాటు రసాయన ఆయుధాలు, నిధులు సమకూర్చాయి. సద్దాంను నియంతగా విమర్శించే వారిని ఆనాడు అమెరికా తీవ్రంగా ఖండించింది! ఆధునిక ఇరాక్ నిర్మాతగానే ఆయన్ని చూడాలని నీతులు చెప్పింది!! అమెరికా చేతిలో కీలుబొమ్మగా, రిమోట్ కంట్రోల్ పాలనకు అంగీకరించకపోవడంతో సద్దాం అమెరికాకు శత్రువు అయ్యాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న అమెరికాకు కువైట్‌లో జోక్యం కలిసి వచ్చింది. కువైట్‌పై దాడి చేశాడన్న నెపంతో ఇరాక్‌పై దాడి చేసింది. ఆంక్షలు విధించింది. భయంకరమైన ఆంక్షలను సవాల్‌గా స్వీకరించిన సద్దాం అమెరికా, దాని తొత్తు బ్రిటన్ తీసుకువచ్చిన అన్ని రకాల ఒత్తిళ్ళను ఎదుర్కొన్నారు. దేశంలో పేదలకు సక్రమంగా ఆహారం సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. పరిమిత వనరులతోనే వైద్య సేవలను గణనీయంగా అభివృద్ధి చేశారు. బిన్ లాడెన్ వంటి అనేక మంది ఇస్లాం ఛాందసవాదులు ఎంతగా ఒత్తిడి చేసినా లొంగలేదు. అరబ్ దేశాల్లో ఇరాక్ ఒక్కటే పూర్తి సెక్యులర్ దేశంగా నిలబడింది. ఇస్లామిక్ చట్టాలను అమలు చేయకున్నా, ఇస్లాంతో పాటు అన్ని మతాలను సమానంగా గౌరవించేవాడు. క్రిస్టియన్ అయిన తారిక్ అజీజ్ సద్దాం తరువాత ప్రభుత్వంలో రెండో స్థానంలో ఉన్నాడంటేనే సద్దాం ఎలాంటి వాడో అర్థం చేసుకోవచ్చును.

ఇరాన్-ఇరాక్ యుద్ధం తరువాత సద్దాం అమెరికా దోస్తీ కూడా ముగిసింది. గల్ఫ్‌లో తమ ప్రయోజనాలను కాపాడుతాడని భావించిన అమెరికాకు సద్దాం కొరుకుడు పడనివాడుగా మారాడు. గత 12 సంవత్సరాలుగా అమలవుతున్న ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాక్ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. అయినా సద్దాం అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగిపోలేదు. పాలస్తీనా విమోచనోద్యమానికి అన్నివిధాలుగా అండగా నిలిచాడు. గల్ఫ్‌లో తిరుగులేని పెత్తనం చెలాయించాలనుకున్న అమెరికా కలలను భగ్నం చేశాడు. ఎలాగైనా సద్దాం అడ్డు తొలగించుకోకుంటే ప్రపంచంలోనే అపార చమురు నిల్వలున్న ఇరాక్‌ను కబళించడం సాధ్యంకాదని అమెరికాకు అర్థమైంది. 1991లో తీరని కక్షను నేడు సద్దాంను అరెస్ట్ చేసి తీర్చుకున్నారు.

ఇరాన్ యుద్ధంలో జీవ రసాయన ఆయుధాలను ప్రయోగించాడని, కుర్దులను హతమార్చాడని, కువైట్‌పై దాడి చేశాడని, దేశంలో తిరుగుబాట్లను అణచివేశాడని వంటి నేరాలను సద్దాంపై మోపాలని అమెరికా నిర్ణయించింది. ఈ నేరాలను ఏ అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారించే ధైర్యం అమెరికాకు లేదు. తానే పోలీస్‌గానూ, తానే సాక్ష్యం చెప్పేవాడిగానూ, తానే శిక్ష వేసేవాడిగా, దాన్ని అమలు చేసే వాడిగా అమెరికా వ్యవహరించాలని అనుకుంటున్నది. ఐక్యరాజ్యసమితికి విచారణలో ప్రమేయాన్ని కల్పించబోవడంలేదని అమెరికా అధ్యక్షుడు బుష్ ప్రకటించారు. దీన్నిబట్టే ఆ విచారణ ఎంత లక్షణంగా, ఎంత 'న్యాయం'గా జరగనుందో అర్థం అవుతూనే ఉంది. తప్పుడు ఆరోపణలు, అందుకు కావాల్సిన అభూతకల్పనలు సృష్టించడం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. తానే నియమించిన న్యాయమూర్తులు అమెరికా అభీష్టానికి విరుద్ధంగా తీర్పులు చెప్పలేరు. సద్దాంపై మోపే నేరాల్లో అమెరికానే ప్రథమ ముద్దాయి. ఇరాన్ యుద్ధంలో రసాయన అయుధాలను ఇచ్చింది అమెరికాయే. ఇలాంటి ఆయుధాలను ఇరాక్‌లోనే తయారు చేసుకోవడానికి కర్మాగారాన్ని నిర్మించింది బ్రిటన్. కుర్దుల తిరుగుబాటులో సద్దాం సరైన చర్యలే తీసుకుంటున్నాడని ప్రస్తుత అమెరికా రక్షణ మంత్రి డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్ ఆనాడు కితాబునిచ్చి, గట్టిగా సమర్థించారు. సద్దాం ఇరాక్‌లో చేసినట్లు చెబుతున్న నేరాల కంటే అమెరికా చేసిన ఘోరాలే అత్యంత హేయమైనవి. ఆంక్షల మూలంగా లక్షలాది మంది మృతికి అమెరికానే కారణం. సద్దాంను తొలగించే పేరుతో విచక్షణారహితంగా బాంబులు వేసి వందలాది మందిని హతమార్చింది అమెరికా. సద్దాంపై నేరాలను విచారించాలంటే అందుకు అమెరికా, బ్రిటన్‌ల నేతలను కూడా విచారించాలి. అందుకే అంతర్జాతీయ న్యాయస్థానంలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో సద్దాంపై విచారణకు అమెరికా అంగీకరించడంలేదు. సద్దాం అడ్డుతొలగగానే ఇరాక్‌లో అరాచకం రాజ్యమేలింది. ఇరాక్‌ను మూడు ముక్కలుగా చేసి, ఇక ఎన్నటికీ కోలుకోలేని విధంగా చేసి, అక్కడున్న చమురు నిక్షేపాలను స్వంతం చేసుకోవడంపైనే అమెరికా ప్రధానంగా దృష్టి పెట్టింది. అందుకు సద్దాం ఉనికి లేకుండా విచారణ పేరుతో ఉరిశిక్షను వేయాలన్నదే దాని కుట్ర. ●

కార్టూన్ కదంబం





ఇరాక్ నియంత సద్దాంను బంధించారు సరే.... ప్రపంచ నియంతను ఎవరు బంధిస్తారు...?



ఔరా!

భారతంలో స్త్రీ !?....

దేశంలోని వివిధ కోర్టుల్లో అత్యాచారం నేరాలకి సంబంధించి మొత్తం 56 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

దేశంలోని ఏదో ఒక మూల సగటున ప్రతి గంటకు ఒక మహిళ అత్యాచారానికి గురవుతోంది.

అత్యాచారం కేసుల్లోని నిందితుల్లో 77 శాతం నిర్దోషులుగా విడుదల అవుతున్నారని దేశ రాజధాని ఢిల్లీ పోలీసుల రికార్డులు తెలుపుతున్నాయి.

ఢిల్లీలో అత్యాచారానికి గురవుతున్నవారిలో 75 మంది మైనర్ బాలికలే. వారిలో 25 శాతం మంది 12 సంవత్సరాల లోపు వయసు వారే.

2001లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అత్యధికంగా మహిళలు అత్యాచారానికి, అత్యాచారాలకు గురైనట్లు కేసులు నమోదయ్యాయి.

2001లో దేశంలో మహిళలపై జరిగిన వివిధ నేరాలకు సంబంధించి 1,43,795 కేసులు నమోదయ్యాయి. ఈ కేసులు 2000 సంవత్సరంలో 1,41,373 మాత్రమే. సమాజంలో రోజురోజుకూ మహిళలను హింసించడం, అత్యాచారాలకు పాల్పడటం పెరుగుతోందని కేసుల సంఖ్య చూస్తేనే తెలుస్తోంది.

బ్రీఫ్‌కేస్ ఖరీదు రు.1,99,000 మాత్రమే!..

3 కోట్ల రూపాయల ఖరీదైన కార్లలో తిరిగేవారికి 1,99,000 రూపాయలు పెట్టి బ్రీఫ్‌కేస్ కొనడం ఒక లెక్కా? కుబేరులు కొనే వస్తువు ఏదైనా వారి స్థాయికి తగ్గట్లే ఉండాలి కదా? అందుకే ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో ఒక ఫ్రెంచ్ కంపెనీ ఇండియాలో తన ఉత్పత్తుల తొలి షోరూమ్‌ను తెరచింది. అక్కడి ధరలు చూస్తే కుబేరులక్కూడా కొద్దిగా బిపి పెరుగుతోందేమోనని కొందరు అనుమానించారట! దుస్తులు తీసుకెళ్ళే బ్రీఫ్‌కేస్ ఖరీదు అక్షరాల ఒక్క రూపాయి తక్కువగా రెండు లక్షలు. లూయీస్ విట్టన్ అనే ఫ్రెంచ్ కంపెనీ భారతదేశంలోని కుబేరులకు ఈ షోరూమ్ రూపంలో సేవలు అందిస్తోంది. ఇక్కడ అతి తక్కువ ఖరీదైనవి తాళాలు తగిలించుకునే కీ చైన్స్ మాత్రమే. వాటి కనీస ఖరీదు 6,900 రూపాయలట. విలాలవంతమైన భవంతుల్లో మూలుగుతున్న నల్లడబ్బును ఎలా ఖర్చు చేయాలి, ఇలాగే కదా?

కళాత్మక శవాలపెట్టె

డబ్బున్నవాడి చావు కూడా కళాత్మకంగానే ఉంటుందట. ఘనా దేశంలోని ఒక కళాకారుడు దీన్నే రుజువుచేస్తున్నాడు. తన దేశంలోని ధనవంతులు చనిపోతే వారిని మోసుకెళ్ళే శవపేటిక కూడా వారి స్థాయికి తగ్గట్టుగానే ఉండాలని తీర్మానించుకున్న ఆయన రకరకాల ఖరీదైన, కళాత్మక శవపేటికలు తయారు చేస్తున్నాడు. చనిపోయిన వారి స్థాయిని బట్టి, ఆ కుటుంబం పెట్టగల ఖర్చును బట్టి శవపేటికలు తయారు చేసి ఇస్తాడట. రక రకాల ఫలాలు, ఇళ్ళు, కార్లు, బైకులు, బైబిల్, చేపలు, క్రూరమృగాలు ఇలా ఏ రూపంలో కావాలన్నా ఆర్డర్లపై తయారు చేసి విమానంలో రవాణా చేస్తాడట. తన దేశంలో మాదిరిగా ప్రపంచంలోని ధనవంతులెవరూ మామూలు శవపేటికల్లో శ్మశానానికి వెళ్ళరాదనే గట్టి అభిప్రాయంతో ఉన్న ఆ కళాకారుడు ముందుగా

ధనిక దేశాలన్నింటా తన అద్భుత శవపేటికలతో ప్రదర్శనలు ఇస్తున్నాడట. ఘనాలో ఉన్న తనకు ఆర్డర్ ఇస్తే ఏ రూపంలో కావాలన్నా సరే శవపేటిక కళాత్మకంగా తయారు చేసి విమానంలో పార్సిల్ చేస్తానంటున్నాడు.

❋ హెచ్. రమేష్‌బాబు

నిత్యనూతన కథానాయకుడు దేవానంద్

అతని కళ్ళలో అదోరకమైన కళాతృష్ణ నిండి వుంటుంది. నిరంతరం ఏదో కొత్తదనం కోసం ఆ కళ్ళు అన్వేషిస్తూనే వుంటాయి. అతని వయస్సు చెప్పకుండా వుంటే అతను నిత్య యవ్వనుడు. వయోజితుడు. ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నిత్యనూతన నాయకుడు. అతడే దేవానంద్.

హిందీ చలన చిత్రసీమను సుమారు 60 ఏళ్ళుగా తన అద్భుత నటనా వైదుష్యంతో చకచ్ఛకితం చేసిన హీరో దేవానంద్. ఇన్నేళ్ళ ఆయన సినీ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత దాదాఫాల్కే అవార్డును 2002 సంవత్సరానికిగాను ప్రకటించడం సినీ అభిమానులందరికీ ఆనందదాయకం. వాస్తవానికి ఎప్పుడో ఈ అవార్డు దేవానంద్‌కి రావలసింది. ఏ కారణం చేతనో ఆలస్యం జరిగింది. అవార్డుకు ఎంపికైన సందర్భంగా" ఆనందంగాను, ఎంతో ఉత్తేజంగానూ వుంది. నేడో, రేపో నాకీ అవార్డు రావలసిందేనని అందరూ అంటూనే వున్నారు. ఏది ఏమైనా అర్హులను విస్మరించలేరని తెలిపోయింది" ఆయన అన్న మాటలు ఇక్కడ గమనార్హం.

దేవానంద్ పూర్తి పేరు "దేవదత్ కిషోరీమల్ ఆనంద్". 1923 సెప్టెంబర్ 23న జన్మించాడు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ వాస్తవ్యుడైన దేవానంద్ లాహోర్‌లో ఆంగ్లంలో ఎం.ఎ. పట్టాపొంది ఉద్యోగం కోసం 1943 జులై నెలలో ముంబాయి చేరుకున్నాడు. అక్కడో నాటక బృందంతో పరిచయమేర్పడి వారి వెంట తిరిగి నాటకాల్లో నటించాడు. వారిచ్చే పారితోషికం చాలక జీవిక కోసం ఓ మిలిటరీ క్యాంటీన్‌లో బిల్ క్లర్క్‌గా పని చేశాడు. అయితే దేవ్ మనసు అనుకోకుండా సినిమాల మీదికి మళ్ళడంతో ఆ ప్రయత్నంలో పడి స్టూడియోల చుట్టూ తిరగడం మొదలు పెట్టాడు. నాటి ప్రభాత్ ఫిలిం కంపెనీ అధినేత బాబూరావు పాయ్ నెలకు నాలుగు వందల జీతంతో అతన్ని తన సంస్థలోకి తీసుకున్నాడు. అప్పటిదాకా ఒక మిలిటరీ పోస్టల్ సెన్సార్ ఆఫీసులో ఉద్యోగం, మరోవైపు 'పర్షియన్ డైరీ' అనే రెస్టారెంట్‌లో సర్వర్‌గా కూడా పని చేసిన దేవ్ సినీరంగంలోని ప్రముఖులెందరో ఆ రెస్టారెంటుకి రావడంతో వారి దృష్టిలో పడి సినిమాల్లోకి ప్రవేశించగలిగాడు.

అయితే ఒకరోజు పి.కె.సంతోషి కొత్తవారితో సినిమా తీస్తున్నాడని తెలిసి వెళ్ళి కలిశాడు దేవ్. బయోడేటా తీసుకున్నారాయన. నెల్లాళ్ళ తరువాత స్క్రీన్ టెస్ట్ కోసం రమ్మని కబురందగా వెళ్ళాడు. ఆ వచ్చిన 55 మందిలో హీరో వేషానికి దేవ్ ఒక్కడే ఎంపికయ్యాడు.

అలా దేవ్ నటించిన 'హమ్ ఏక్ హై' తొలి చిత్రంగా 1946లో విడుదలైంది. ఈ సినిమా రానున్న స్వాతంత్ర్యం దృష్ట్యా జాతీయ సమైక్యతావశ్యకతను బోధించింది. సినిమా షూటింగ్ పూణెలో జరిగినపుడు గురుదత్, దేవానంద్ ఒకే రూపంలో ఉండేవారు. ఆ రోజుల్లోనే వీరికి బలరాజ్ సహానితో మైత్రి ఏర్పడింది. అయితే అప్పటికే దేవానంద్ అన్న చేతన్ ఆనంద్ ముంబాయిలో సినీ నిర్మాణంలో నూతన పోకడలకు శ్రీకారం చుట్టాడు. 1945లోనే ఆయన తీసిన 'నీచానగర్' చిత్రం కేన్స్ చలన చిత్రోత్సవంలో భారతదేశం నుండి ఒకే ఒక అధికారపు ఎంట్రీగా ఎంపికైంది.



మధుబాలతో దేవ్

దేవ్ తొలిచిత్రం 'హమ్‌ఏక్‌హై' బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. ఆ తర్వాత సంతోషితోనే 'బర్సాత్ కీ ఆగ్'లో నటించగా అదీ ఫ్లాపయింది. చివరకు షాహిద్ లతీఫ్, ఇస్మత్ చుగ్తాయ్ దంపతులు దేవ్‌ను చూడగానే తమ 'జిద్దీ' చిత్రానికి ఎంపిక చేశాడు. ఈ చిత్రం రిలీజయ్యాక దేవానంద్ రొమాంటిక్ శకం మొదలై యాభై ఏళ్ళ పాటు నిరాటంకంగా కొనసాగుతూనే వుంది.

1947లో దేవ్, చేతన్‌లు నికొలాయ్ గొగోల్ రాసిన 'ఇన్స్‌పెక్టర్ జనరల్' నవలను 'అఫ్సర్'గా సురయా నాయికగా తీశారు. అంతగా విజయం కాని ఈ చిత్రాన్ని తిరిగి చేతన్ 1980లో 'సాహిబ్ బహదూర్'గా పునర్నిర్మించి నష్టపోయాడు. అయితే ఈ మధ్య కాలంలో 'హమ్ భీ ఇన్సాన్ హై', 'నమూనా', 'ఉదార్ (1949), 'దిల్‌రుబా', 'హిందుస్తాన్ హమారా (1950)' చిత్రాల్లో హీరోగా నటించిన దేవ్ హీరోగా బల్‌రాజ్ సహానీ స్క్రిప్టు రాయగా, గురుదత్ దర్శకత్వంలో 'బాజీ' (1951) తీశారు.



కల్పనా కార్తీక్‌తో దేవ్

ఈ సినిమా ఆ రోజుల్లో గొప్ప హిట్. అంతేకాదు హిందీ తెరపై క్రైమ్ థ్రిల్లర్ చిత్రాల నిర్మాణానికి నాంది పలికింది. 'బాజీ' చిత్రం ద్వారానే కవి సాహిర్ దియాని, గీతాబాలి, మోనాసింగ్ అనే కామెడీ నటి వెండితెరకు పరిచయమైనారు. మోనాసింగ్ ఆ తర్వాత కల్పనా కార్తీక్‌గా పేరు మార్చుకొని దేవ్‌కి భార్య అయ్యింది. ఆమె 'నౌ దోగ్యారా' (1957) తరువాత సినిమాల నుండి విరమించుకుంది. తొలినాట కొరియోగ్రాఫర్‌గా వున్న గురుదత్‌ని దేవ్ నవకేతన్ సంస్థపై తీసిన 'బాజీ'తో దర్శకుడ్ని చేయగా ఆ తర్వాత గురుదత్ స్వంతంగా మొదట తీసిన 'సిఐడి'కి దేవ్‌నే హీరోగా చేసి హిట్ సాధించాడు.

దాదాపు ఏకకాలంలో సినీరంగ ప్రవేశం చేసిన దేవ్, రాజ్, దిలీప్‌ల్లో దేవ్ నటనాశైలి దిలీప్, రాజ్‌కపూర్‌ల సమ్మేళనంగా చెప్పుకోవచ్చు. దిలీప్‌లోని ట్రాజెడీ, రాజ్‌లోని రొమాంటిజమ్ దేవ్‌లో కలగలిసి వుంటాయి. 1957లో జెమినీ వారు దిలీప్, దేవ్‌లతో బీనాగాయ్ నాయికగా 'ఇన్సానియత్' తీసి గొప్పహిట్ సాధించారు. ఈ సినిమా తెలుగు 'పల్లెటూరి పిల్ల'కు రీమేక్.

ఈ నేపథ్యంలో దేవానంద్ తమ నవకేతన్ సంస్థపై 'బాజీ' మొదలుకొని 'టాక్సీడ్రైవర్' (1954), 'కాలాపానీ' (1958), 'కాలాబజార్' (1960), 'హమ్‌దోనో' (1961), 'గైడ్' (1965), 'జ్యూయల్‌థీఫ్' (1967), 'తేరేమేరేసప్నే' (1971), 'ఛుపారుస్తుం' (1973), 'జానెమన్' (1975), 'బుల్లెట్' (1977), 'మై తేరే లియే' (1986) వంటి చెప్పుకోతగ్గ చిత్రాలు తీయగా 'ప్రేమ పూజారి' (1968) చిత్రం నుండి దర్శకునిగా మారి ఆ తరువాత నేపాల్లో తీసిన 'హరేరామ హరేకృష్ణ', లండన్‌లోకి అక్రమంగా ప్రవేశించిన భారతీయ ఇమ్మిగ్రెంట్ల దుస్థితిపై వచ్చిన 'దేశ్ పరదేశ్', 'హీరాపన్నా', 'ఇష్క్‌ఇష్క్‌ఇష్క్', 'లూట్‌మార్', 'స్వామీదాదా', 'లష్కర్', 'ప్యార్‌కా తరానా', 'రిటర్న్ ది జ్యువెల్ థీఫ్', 'ఆనంద్ ఔర్ ఆనంద్,', 'సచ్చే కా భోలా భోలా', 'అవ్వల్ నంబర్', 'సాక్సోన్', 'జనానా దిల్ సె దూర్', 'మై సోలా బరస్‌కీ', 'సెన్సార్' వంటి చిత్రాలు రూపొందించాడు దేవ్.

మరోవైపు దేవ్ బయటి చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించినవే. నూతన్, ముంతాజ్, టీనామునీం, మీనాకుమారి, ఇంద్రాణి బెనర్జీ, హేమమాలినీ, మధుబాల, వహీదా రెహ్మాన్ వంటి తారల సరసన 'తమాషా, వారెంట్, సనమ్, బడప్పన్, కినారే కినారే, మహల్, తేరేఘర్‌కి సామ్నే, దునియా, గాంబ్లర్, ఎ గులిస్తా హమారా, జానీమేరానామ్, సజా, తీన్‌దేవియా, పేయింగ్ గెస్టు, జబ్‌ప్యార్ కిసీసే హోతాహై, బనారసిబాబు, బాబీ, లవ్ మేరేజ్, మిలాప్ వంటి చిత్రాల్లో నటించారు. ఇలా ఆయన నటించిన చిత్రాల సంఖ్య నూరుపైనే ఉంటుంది. దేవానంద్ నిత్యనూతన యువకుడుగా హీరోగా సుమారు 60 ఏళ్ళ కాలంగా కొనసాగుతూనే వున్నాడు. ఇది అందరికీ సాధ్యపడేది కాదు. తొలినాట నూతన్, మధుబాల, మీనాకుమారి వంటి వారి తరం నుండి మొన్నటి టీనా మునీం, కల్పనా కార్తీక్, జీనత్ అమన్ వంటి వారి సరసన సైతం గంతులేస్తూ నటించిన ఎవర్‌గ్రీన్ హీరో ఆయన. తనదైన శైలితో హీరోయిజంలో రఫ్‌నెస్‌ను ఆవిష్కరించి నటించడం వెండితెరపై ఆయనతోనే మొదలు. జీన్స్, ఫుల్‌ప్లేన్ షర్ట్స్, టోపీలు, రుమాలులు, బ్యాగీలు ఆయన ద్వారానే హీరోల దుస్తులుగా సినీరంగంలోకి ప్రవేశించాయి. ఒక దశలో సినీరంగంలోని (50-70 దశకాల్లో) ప్రతి తారా దేవ్ సరసన నటించేందుకు ఉవ్విళ్లూరేవారు. జీనత్ అమన్, వహీదా, టీనామునీమ్, రిచాశర్మ, నటాషాసిన్హా, ఫాతిమా షేక్, అనితా అయూబ్, జ్యోతిబక్షి, ఏక్తా వంటి తారలు, జానీ వాకర్ (బాజీ) శత్రుఘ్నసిన్హా (ప్రేమపూజారి), జాకీష్రాఫ్ (స్వామిదాదా), శేఖర్‌కపూర్ (ఇష్క్‌ఇష్క్‌ఇష్క్) వంటి నటులను దేవానందే సినీరంగానికి పరిచయం చేశాడు. నవకేతన్ సంస్థపై ఆయన తీసిన సినిమాల సంఖ్య సుమారు 60. దేవ్ 80 ఏళ్ళ వయసు మీద పడినా నిత్య యువకుడిలా గడుపుతాడు. రోజుకు 12 నుంచి 14 గంటల పాటు పని చేస్తాడు. మద్యం, సిగరెట్లకి దూరంగా వుండటం బాలీవుడ్‌లో దేవానంద్ ప్రత్యేకత. కొత్త చిత్రాలకు కథలు రాయడంతోనో, సినిమా పంపిణీదారులతో, సహనటులతో, టెక్నీషియన్లతో చర్చలు జరుపుతూ నిత్యం నూతనోత్తేజంతో గడుపుతూ వుంటాడు. దేవ్ నటుడిగా ఎంత ఉన్నత దశకు చేరుకున్నా వ్యక్తిగా సాదాసీదాగా నిర్మోహమాటంగా సమకాలీకుల పట్ల

దేవానంద్ - సురయా

సురయా-దేవానంద్‌లది తొలినాటి హిట్ పెయిర్. ప్రతాప్‌రాణా అనే నిర్మాత తీసిన 'విద్యా' (1948) చిత్రంలో వీరు తొలిసారిగా కలిసి నటించారు. సురయా హాలీవుడ్ నటుడు గ్రెగరిపెక్ అభిమాని. దేవానంద్ పోలికలు కూడా అలాగే వుండడంతో అతన్ని అభిమానించడం ప్రారంభించింది. అదే క్రమంగా ప్రేమగా మారింది. అయితే వారిరువురు కలిసి నటించిన ఏ చిత్రమూ హిట్ అవ్వలేదు. కానీ నిర్మాతలకు మళ్లీ దేవానంద్‌నే హీరోగా తీసుకొమ్మని సిఫార్సు చేసేది సురయా ప్రేమ. అలా వీరు 'జీత్', 'ఫాయల్' (1949), 'అఫ్సర్', 'నీలి' (1950) 'దో సితారే', 'సనమ్' (1951) ఏడు చిత్రాలలో నటించారు. కానీ వారి ప్రేమను సురయా పెద్దలు అంగీకరించలేదు. సురయా వెంట ఎప్పుడు ఆమె నాయనమ్మ కాపలా వుండేది. 'సనమ్' సెట్స్‌పై ఒక షాట్‌లో సురయాను కనురెప్పలపై దేవ్ చుంబించాల్సి వుంది. బామ్మ ఇందుకు ససేమిరా అంది. చివరకు క్యాషియర్ తెలివిగా సురయాతో మీకు రావలసిన డబ్బు ఆఫీసుకు వచ్చి తీసుకోండని బామ్మకి వినపడేలా చెప్పాడు డబ్బు మాట వినేసరికి బామ్మ క్యాషియర్ వెంట

ఆఫీస్‌కు వెళ్ళింది. దర్శకుడు అనుకున్నవిధంగా షాట్ పూర్తి చేశాడు. చివరకు సురయా పెద్దలు కాదనడంతో దేవానంద్ ప్రేమ కథ విషాదాంతమైంది. తన ప్రేమను చంపుకోలేని సురయా అవివాహితగానే మిగిలిపోయింది. కాగా తాను తీసిన బాజీ హీరోయిన్ కల్పనా కార్తీక్‌ను 1954లో 'టాక్సీడ్రైవర్' షూటింగ్ జరుగుతుండగా స్టూడియోలోనే పెళ్లాడేశాడు దేవానంద్.

కూడా గౌరవం ప్రకటించే సంస్కారం కలవాడు. 1983లో ముంబాయిలోని ఒక స్టూడియోలో దేవ్ 'స్వామిదాదా' షూటింగ్ జరుగుతోంది. మరో ఫ్లోర్‌లో రాజ్‌కపూర్ చిత్రం చిత్రీకరణ జరుగుతుంది. అపుడు రాజ్‌కపూర్ దేవ్ వద్దకు వచ్చి సినీరంగంలో గత వైభవం గురించి మాట్లాడాడు. అప్పుడు దేవానంద్ వినయంగా వంగి రాజ్ పాదాలకు నమస్కరిస్తూ 'మీరు మాట్లాడుతున్న దాని గురించి నాకు తెలియదు. మీ పాత రోజులు మారిపోయాయి కానీ మీలో మాత్రం మార్పు రాలేదు' అని రాజ్‌లోని సిన్సియారిటీని కొనియాడారు. దీనిని బట్టి దేవానంద్ ఎప్పటికప్పుడు సినీరంగంలో మారుతున్న విలువలకు ప్రమాణాలకు అనుగుణంగా అనుసరించడం వల్లే ప్రేక్షకులకు చేరువ కాగలిగాడన్నది స్పష్టమవుతుంది. జీనత్ అమన్ ఒక సందర్భంలో - 'దేవానంద్ ఒక అద్భుతమైన వ్యక్తి. ఏభై ఏళ్ళుగా అదే రకమైన హీరోయిజంతో ఎందరో నాయికలను పరిచయం చేశారని' ప్రస్తుతించింది. తనతర్వాతి తరంలో వచ్చిన అమితాబ్ వేవ్‌లో సైతం తన ఫాలోయింగ్‌ని కోల్పోని దేవానంద్ ఒక దశలో 'జంజీర్' చిత్రాన్ని దర్శకుని వల్ల వదలుకోగా ఆ చిత్రాన్ని చేసిన అమితాబ్ సినీ జీవితం మహత్తరమైన మలుపు తిరిగింది. అలా దేవ్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడిన తారలెందరో వున్నారు.

తన సినీ జీవితంలో నటునిగా, నిర్మాతగా, దర్శకునిగా దేవానంద్ ఈనాడు సమున్నత స్థానంలో వున్నాడంటే ఎన్నో ఎదురు దెబ్బలను ఎదుర్కొని ఎప్పటికప్పుడు నిలదొక్కుకున్న అసాధారణ వ్యక్తి. సినిమాల్లో ఆయన సాధించిన జయాపజయాలు సమాన నిష్పత్తిలోనే వున్నాయి. వీటిలో కొన్ని అరుదైన సక్సెస్‌లున్నాయి. చితిలోపడి భస్మమైపోయి తిరిగి అందులో నుండే పునరుద్భవించిన పక్షి జీవితంతో దేవానంద్ ఉత్థాన పతనాలను పోల్చి చూడవచ్చు. జయాపజయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకధాటిగా సినిమాలు తీస్తూనే వుండడం ఆయనలోని విభిన్నమైన విశిష్టం.

దేవానంద్‌కి రాజకీయాల పట్లా ఆసక్తి ఉంది. దాంతోనే ఒక రాజకీయపార్టీని కూడా స్థాపించాడు. బి.బి.సి.కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అప్పటి ఎమర్జెన్సీ గురించి విమర్శించాడు. 1979లో జనతా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆయన ఉత్తర బొంబాయిలోని శివాజీ పార్కులో పెద్దర్యాలీ నిర్వహించి 'నేషనల్ పార్టీ'ని స్థాపించాడు. ఇది



జరిగిన ఆరువారాల పాటు ఎందరెందరో ఆయన చుట్టూ తిరిగారు. దాంతో దేవానంద్ వివేచన కోల్పోయి వారు చెప్పిందంతా చేశాడు. చుట్టూ తిరిగేవారిని పూర్తిగా విశ్వసించి మోసపోయాడు. ఆ తర్వాత దేవానంద్ పార్టీ కాలగర్భంలో కలిసిపోయింది. తిరిగి తన జీవితానికి మహర్దశను ఇచ్చిన సినిమాల్లోకే వచ్చాడు. మళ్ళీ ఎప్పుడూ రాజకీయాల ఊసెత్తలేదు.

దేవ్ ఎప్పుడూ తాను విశ్వసించిన దాన్ని ఆచరిస్తాడు. 75 ఏళ్ళ వయసులో కూడా "జానాన దిల్‌సే దూర్'లో 19 ఏళ్ళ అమ్మాయితో హీరోగా చేశాడు. 'లైమ్‌లైట్' సినిమా గురించి స్విట్జర్లాండ్‌లోని చార్లీచాప్లిన్ నివాసంలో చర్చలు జరపడం ఆయనకే సాధ్యమయింది. సాహిత్యంలో నోబెల్ గ్రహీత 'హెరెల్ ఎస్‌బక్'తో కలిసి హిందీ ఆంగ్లంలో 'గైడ్' సినిమా నిర్మించడం నేటికి గొప్పసాహసమే. అంతెందుకు 80 ఏళ్ళు నిండిన ఈ వయస్సులో కూడా ఆయన 'సాంగ్ ఆఫ్ లైఫ్' అనే చిత్ర నిర్మాణంలో తల మునకలై వున్నారు. బాక్సాఫీస్ వద్ద తన సినిమాల జయాపజయాలతో నిమిత్తం లేకుండా నిత్యం సినిమాల నిర్మాణంలో గడపడం ఆయనకే చెల్లు. ఇదే విషయాన్ని ఒక ఇంటర్వ్యూలో - "నేనెల్లప్పుడూ పని చేస్తాను. పని లేకుంటే బాధపడతాను. వయసు నాకు అడ్డంకి కాదు. కాలం నన్ను మార్చలేదు. నేనిప్పటికీ యువకుడినే. ఈ అందమైన వృత్తిలో కొనసాగినందుకు తృప్తిగా వుందని స్వయంగా ఆయనే చెప్పుకున్నాడు.

ఇన్నేళ్ళ తన సినీ సేవలకు దేవానంద్ అందుకున్న గౌరవాలు ఎన్నో. 2001 రిపబ్లిక్‌డే అవార్డుల్లో 'పద్మభూషణ్' అంతకుముందు ఏడాది నవంబర్ 18న సినిమా ఎక్స్‌ప్రెస్ వారి ప్రతిష్ఠాకరమైన 'హీరో ఆఫ్ ది సెంచరీ' లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. 'హమ్‌దోనో' చిత్రానికి బెర్లిన్ చిత్రోత్సవంలో ప్రశంసలు, 'గైడ్' సినిమాకి ఫిలింఫేర్ అవార్డు. మరో అయిదు చిత్రాలకు జాతీయ అవార్డులను పొందారు. 1999 హైదరాబాద్ ఫిల్మోత్సవానికి ఆయనే ముఖ్య అతిథి. ఈ డిసెంబర్ 29న భారత రాష్ట్రపతిచే అందుకోబోతున్న 'దాదాఫాల్కే' అవార్డు కింద రెండు లక్షల నగదుతో పాటు స్వర్ణకమలం షీల్డ్, శాలువాతో సన్మానితులవబోతున్నారు.

భారత రత్న మరో ఫాల్కే అవార్డు గ్రహీత లతా మంగేష్కర్ అన్నట్లుగా - 'నేను దేవానంద్‌తో కలిసి చాలా సినిమాల్లో పని చేశాను. నటనలో అతని అంకితభావం, ప్రతిభ నిరంతర పరిశ్రమకు నిజమైన గుర్తింపు ఈ ఫాల్కే అవార్డు. ఈ అవార్డు ఆయనకు వచ్చినందుకు నేనే కాదు పరిశ్రమ అంతా సంతోషిస్తుంది.'

(వ్యాసకర్త ఇటీవలే 'ఫాల్కే అవార్డు విజేతలు' గ్రంథాన్ని వెలువరించారు) ●

కిశోర్‌కుమార్-దేవానంద్

దేవానంద్ తన సినీ కెరీర్‌లో ఎందరో హీరోయిన్‌లను, రాజఖోస్లా, గురుదత్, విజయ్ ఆనంద్ వంటి దర్శకులను పరిచయం చేయడమే కాక గాయకుడు కిశోర్ కుమార్, సంగీత దర్శకులు ఎస్.డి.బర్మన్, ఆర్.డి.బర్మన్‌లతో టీమ్‌గా ఏర్పడి ఆణిముత్యాలనదగిన పాటలను రూపొందించ గలిగారు. ముఖ్యంగా కిశోర్ కుమార్ తన తొలి పాతికేళ్ళ గాయక జీవితంలో పాడిన తొంభై శాతం పాటలు దేవానంద్‌వే కావడం విశేషం. ఇంకా చెప్పాలంటే రాజేష్ ఖన్నాకి 'మేరే సప్నోంకి రాణీ కబ్ ఆయేగీ తూ' (ఆరాధన) పాడే దాకా కిశోర్ కుమార్ దేవానంద్‌కి పాడడంతోనే సినీరంగంలో తన అస్తిత్వాన్ని నిలుపుకున్నాడంటే అతిశయం కాదు. 'మానా జనాబ్ నే పుకారా నహీ' (పేయింగ్‌గెస్ట్) తరువాత 'జీవన్‌కే సఫర్‌మే రాహీ (మునీంజీ), 'గాతా రహే మేరా దిల్' (గైడ్), 'ఏ దిల్ నా హోతా బేచారా' (జ్యూయెల్ థీఫ్), 'హై అప్నా హోతాకే సాథ్', 'ఖ్వాబ్ హోతుమ్ యా కోయి హకీకత్', 'బాదల్ బిజిలీ చందన్ పానీ' వంటి పాటలు దేవానంద్‌కు పాడినవే.

ఉత్తరాది వారిదే ఆధిక్యం

దాదాసాహెబ్ ఫాల్కే శతజయంతి సందర్భంగా భారత ప్రభుత్వం 1969లో ఫాల్కే పురస్కారాన్ని నెలకొల్పింది. ఇప్పటివరకు ఈ అవార్డును అందుకున్న 34 మందిలో 28 మంది ఉత్తర భారతీయులే. వీరిలో 19 మంది హిందీ రంగానికి చెందగా ఏడుగురు బెంగాలీలు. అస్సామీ, మరాఠీ రంగాలకు ఒక్కొక్కరికి అందింది. తెలుగు రంగానికిచెందిన నలుగురు, తమిళ, కన్నడ రంగాలకు చెందిన ఒక్కొక్కరికి ఈ అవార్డు దక్కింది. భాషాపరమైన విభజన ఇలా ఉండగా ఈ ఫాల్కే అవార్డు గ్రహీతలలో 13 మంది దర్శక నిర్మాతలు, 13 మంది నటులు, నలుగురు సంగీత దర్శకులు, ఇద్దరు గేయకవులు, ఇద్దరు గాయనులు వున్నారు. మరో విభజనలో మొత్తం 34 మంది గ్రహీతలలో 29 మంది పురుషులు వుండగా, ఐదుగురు మహిళలు వున్నారు.

* బింగి సత్యనారాయణ

యాది (కొచ్చిండు)

గాదినం పోశయ్య ముబ్బుగాల్లే ఐదుగొట్టంగ నిద్రలేసిండు. ఇంకొదినమయితే ఆరుగొట్టెదాక ముద్దుగ బండుకునేటోడె. గాని గాదినంవండ్గ గదా! వండ్లు తోమిండు. వణుక్కుంట వణుక్కుంట సల్లటి నీళ్ళతోటి నెత్తిమీదికెళ్ళి తానంజేసిండు. మంచు చిక్కగా గురుస్తుంది. ఇంట్లకు బోయి బాల్ దూస్కుండు. దేవుడ్కి మొక్కి బొట్టు పెట్టుకుండు. దండం మీదున్న చిన్గిన తువ్వాల తల్కాయకు బిర్రుగ చుట్టుకుండు. వణుకుతున్న పెయ్యికి గరంగరం చాయిపడ్తె బాగుండనుకుండు: పిల్లిదాగకుండ పెండ్లాం దాసి పెట్టిన గిన్నె కింద సూసిండు. గిలాస్‌ల పాలున్నయి. పెండ్లాంని నిద్ర లేపుదామని అనుకుండు. గడియ పుర్సత్‌లేదు గవ్వఅమ్‌దానీ (క్షణం తీరాకా లేదు... దమ్మిడీ ఆదాయం లేదు) లేదని దినాంగుల్గె నోరు యాదికొచ్చి మానుకుండు. గదీగాక శక్కరిచాయిపత్త ఒడ్సిపోయిందని యాడికెల్లి తెచ్చి చెయ్యమంటవని కమ్మలు లేసి పోయెటట్టు ఒల్లుతది. సప్పుడుగాకుంట గుడ్సె బైటికి నడ్సిండు. ఎదురుంగ సూసిండు. మంచుల తడ్సి ముద్దెయి పోయినట్టు ఉంది. తనకి బువ్వపెట్టే రిక్షా. సూర్ల జెక్కిన చింపులంగీ తీసిండు. మంచిగ తుడ్సి ఆయిలేసిండు. ఒగసారి టైర్లు ఒత్తిజూసుకుండు పంచరగిట్ల అయిందోమోనని. సేతికున్న నంబర్ల వాచీని ఒగసారి సూసుకుండు. సరిగ్గా నాల్గున్నర సూపించింది. హేండిల్ మొక్కి రిక్షా ఎక్కి స్పీడుగా దొక్కుకుంట బస్‌స్టాండ్ వైపుకు బోయిండు. ఆడికి బోవాలంటే గోరీల గడ్డదాటి బోవాలె. గప్పటికే లేచిన కొంతమంది పొద్దుగాల్లే బోయె పనికి వస్తూపోతూ కండ్ల బడ్డరు. ఇయ్యాల జల్ది బోవాలె అన్న ఆలోచన ఇంకింత స్పీడుగ దొక్కిపిస్తుంది. ఎందుకంటే గాదినం పండ్గ. ఐదో పదో సంపాయిస్తె ఇంట్ల కర్చులకు ఎల్తది. గదీగాక పోరగాల్లు పండ్గపూట మంది మొగం సూడొద్దని ఒగ దిగులు. ఇగ తన పెండ్లాందెమో నెల ఫస్ట్ తారీఖున జీతమొస్తది. తన లెక్కల రోజు కూలీ గాదాయె! గింతకీ తన పెండ్లాం జేసె పని... పెండ్లాం మొగళ్ళు కొల్వుజేసె ఇండ్లల్ల బాసాన్లు, బట్టలుతుకుతది. నిజం చెప్పాలంటే పోశయ్యకన్నా ఎక్కువనె సంపాయిస్తది. గందుకనే గప్పటిసంది నోరుజేసుడు షురువు జేసింది. తను గూడ ఏంఅన్నా సప్పుడు గాకుంట ఆడి నుండి లేసి బోతడు. ఇగ రోజు ఏమన్న గిరాకీ ఐతేనే ఇంటికాడ మూడురాళ్ళ పొయ్యి మీదికి కుండ ఎక్కుతది. జేసిన కస్టంలకెళ్ళి ఇంటికి బోయెటప్పుడు రెండు మూడు కిలల అగ్వసగ్వ నూకలు, కూరగాయలు... దిస్కుని బోతడు గాని, గందులోకెల్లి అగాయి బుగాయి కర్చులు పెట్టడు. ఎప్పుడన్న దాగితే సింగిల్ చాయి. ఒక్క బీడీల కట్ట. అగ్గిపెట్టె... బస్ గింతే తన దినాం కర్చు. ఆలోచన్ల తోటే బస్‌స్టాండ్ వచ్చేసిండు. ఎదురంగ జూసెసరికి గుండె గుభేల్‌మంది. థూ నీ... ఇయ్యాల గాచారం బాగ లేదనుకుండు. మూడు రిక్షాలు లైన్లో వున్నాయి. ఆళ్ళకన్న ముందుగాల రావాలని మస్త్‌కోషిష్ జేసిండు. తన ఆశ నెరవేరకబోయెసర్కి మొగం చిన్నబోయింది. జేసేది లేక లైన్లో బెట్టిండు. రోడ్డు మీదికి జూసిండు. బజారు లైట్లు పట్టపగలు జెస్తున్నవి. ఒక్క పుర్గు లేదు. స్టాండు జూసిండు. ఆడగూడ ముబ్బుగాల్ల బస్‌కు బోయెటోళ్ళుగాని, వచ్చేటోళ్ళుగాని ఒక్కరు లేరు. అస్సలు బస్సులొస్తేగదా! జెనం నిన్నటి నంది బైట

తిర్గుటకు బుగులు పడ్తుంద్రుగదా! ఎందుకంటే నిన్నటిదినం అధికార పార్టీ ముక్యనాయకున్నొకర్ని బాంబులతో ఎవలో రోడ్డు మీద సంపింద్రు. ఇగప్పటి సంది పెద్దలొల్లి. కొట్లాట షురువైంది. సచ్చినోడి పార్టీ కారెకర్తలు, అభిమానులు రెచ్చిపోయి, అపోజిషన్ పార్టీ వాళ్ళ మీద దాడికి దిగి ఆళ్ళ ఇండ్లు, దుకాండ్లు నాశనం జేసింద్రు. ఇంక దొర్కి నోళ్ళను దొరికినట్లు నర్కింద్రు. ఆళ్ళను ఈళ్ళు... ఈళ్ళను ఆళ్ళు... గప్పుడు సర్కారు 144 సెక్షన్ బెట్టింద్రు. రెండు మూడుగంటలకోసారి కర్ఫుని సడలిస్తుంద్రు. పోశయ్య ఓ పారి దీర్ఘంగా నిట్టూర్చిండు. మంచుకు పెయ్యి మీదిబట్టలు తడ్సినట్టయినయి. ఎదురుంగ తన తోటోళ్ళు మంట బెట్టి కాపుకుంటున్నరు. ఆడికి పోదామని లేసిండు. బోయిగూసుని అంగిజేబులున్న బీడీని తీసి మంట బెట్టిన కట్టెతోని ముట్టించుకుండు. గపగప దమ్ము బీల్చుడు షురువు జేసిండు. ఆళ్ళు మాట్లాడుకుంటున్న మాటలు మెల్లెగా సేవుల పడ్డయి. మద్దెరాత్రి నుండి కర్ఫితీసెసింద్రని.... గా మాట ఇనంగనే జెరంత పానం లేసొచ్చినట్టయింది పోశయ్యకు... ఆట్లాట్ల పూరాగా తెల్లారింది. గాని గిరాకీ రాకపోవడంతో గూసున్న ఆళ్లు, సచ్చినోడ్ని, సంపినోడ్ని, తమకు తెలిసిన బండబూతులు తిట్టుకుంద్రు. ఒగటి రెండు బస్‌లు రావడం ఉసారుగా లేసింద్రు. గవి కాలిగా బోతున్నాయి. వస్తున్నయి. సలి తన పెయ్యిని ఇంకా వణికిస్తుండటంతో ఎదురుగా వున్న ఓటల్‌కేసి జూసిండు. చాయిదాగలన్న కోరిక బుట్టింది. జేబులు దోలాడిండు. ఏదోబిళ్ళ చెయ్యికి తాకంగనే, మొగం బజారు లైట్ లెక్కల ఎల్గింది. బైటికి తీసిండు. ఐదురుపాల బిట్టు. రోడ్డుదాకవచ్చి అటిటు జూసిండు అలవాటు కొద్ది. నిమ్మలంగ నడ్సుకుంట ఓటల్లకు బోయిగూసుండు. ఎప్పుడు గర్దితో ఉండె ఓటల్‌లో మంది పల్చగుంద్రు. టెబుల్ మీదున్న గిలాస్‌లకెల్లి ఒగటి తీస్కొని నోట్ల బోసుకుండు. సల్లగుండటం దబ్బున పక్కకు బెట్టిండు. జివ్వుమన్న దవడల్ని మెల్లెగా బత్తుకుండు. పక్కకు టేబుల్ తుడ్సుతున్న పిల్లగాడ్ని సూసి, "ఏక్‌సింగిల్ చాయి!" అన్నాడు టేబుల్ మీద ఏదో దరువేసుకుంటూ. రెండు నిముషాలల్ల పొగలు కక్కుతున్న గరంగరం చాయికోపు పోశయ్య ముంగట బెట్టి బోయిండు. ఆడ్ని సూడంగనే పట్నంల ఉన్న తన కొడుకు యాదిగాడు యాదికొచ్చిండు. అంతే ఎత్తు - ఉమర్. గప్పటి

(మిగతా 14వ పేజీలో)

* యాసలపు సూర్యారావు

అజ్ఞానం సృష్టించిన వింత జంతువు

తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో వింత జంతువు ఉదంతం పట్టణ ప్రజల్ని, పరిసర గ్రామ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసింది. నవంబర్ 6న పెద్దాపురం పక్కనే గల ఒక గ్రామంలో గొర్రెలు కాసే కుర్రాడ్ని మొదటగా పిచ్చికుక్క కరిచింది. అదేరోజు సాయంత్రం మరో వీధిలో ప్రవేశించి నలుగురు వ్యక్తుల్ని, ఒక గేదెను తీవ్రంగా కరిచి గాయపర్చింది. మళ్ళీ అదే రోజు రాత్రి 10 గంటలకు కట్టమూరు పుంత అనే వీధిలోనూ, నత్తెమ్మ కాలనీలోనూ గల యండమూరి అమ్మాయమ్మ అను వృద్ధురాలి తలపై పడి తీవ్ర గాయం చేసింది. అదే క్రమంలో మరికొంతమందిని కరవటంతో వీరందర్ని గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకువెళ్ళి పిచ్చికుక్క కాటుకు చేసే ఇంజక్షన్లు చేయించారు. ఆ పిచ్చికుక్క ఈ విధంగా సుమారు 20 మంది వరకూ గాయపరచింది. అయితే ఇక్కడే ఒక సందిగ్ధం ఏర్పడింది. తమను కరిచింది కుక్కే అని దారిన వెళుతూ దాని బారిన పడినవారు బాహాటంగా చెపుతుండగా అదే రోజు రాత్రి 10 గంటల కరిచింది కుక్కకాదు అదొక వింత జంతువు అని చెప్పుకొస్తున్నారు. ఒకరు సిందుగంటే, ఒకరు మర్లమెకం, అని ఇంకొందరు తల సింహంగాను మిగిలింది మనిషి రూపంగాను వుందని చెబుతున్నారు. ఇంతకంటే విచిత్రమైన వాదన ప్రజల్లో దావానలంలా వ్యాపించింది. వింత జంతువు అనేది జంతువు కాదని అతీత శక్తని, ఎవరో మాంత్రికుడు పిశాచాన్ని ఇక్కడ వదిలి పోయాడని అదే ఒంటరిగా వున్న మనిషిపై పడి గోళ్ళతో రక్కేసి అదృశ్యమవుతోందనే పుకార్లు ఊరంతా వ్యాపించాయి. మొదట జరిగిన సంఘటన తాలూకు భావన ప్రతి ఒక్కరిలో బలీయమైన ప్రభావాన్ని చూపింది. ఈ భయం ప్రధానంగా నిరక్షరాస్యులైన పేదవారిలోనే వుండటం ఆలోచింపదగ్గ అంశం. ఫలితంగా కొన్ని వీధుల్లోని ప్రజలు మరీ ముఖ్యంగా యువకులు 30, 40 మంది వరకూ కర్రలు, కత్తులు, బరిశలను చేతపట్టుకొని వీధుల్లో దళాలుగా తిరగనారంభించారు. ఈ విధంగా తెల్లవార్లూ ప్రజలు భయకంపితులై కొన్ని రోజులు పనీ, పాటూ మానేసి నిద్రాహారాలు లేకుండా భయం గుప్పిట్లో వుండిపోయారు. పిల్లలను బడికి పంపడానికి కూడా భయపడి బడి మానిపించిన కుటుంబాలు కూడా వున్నాయి. రెండో ఆట సినిమాకి ప్రజలు వెళ్ళటం తగ్గిపోయింది. రాత్రి అయిందంటే చాలు పట్టణంలో ఏదో ఒక మూల వింత జంతువు కరిచిందనో, మీద పడిందనో, రక్కిందనో వార్తలు పుకార్లుగా షికార్లు చేయడం జరిగేది.

ఇదిలా వుండగా ఒకరోజు హఠాత్తుగా స్థానిక చేపల వీధిలోని ఆరు సంవత్సరాల బాలికని వింత జంతువు, ఇంటి దగ్గర ఉన్నదాన్ని దూరంగా తీసుకెళ్ళి కంఠం కొరికేసిందని తెలిసి జనమంతా వెళ్ళి చూశారు. అక్కడ ఆడపిల్ల రక్తం మడుగులో పడి వుంది. పీక బ్లేడుతో కోసినట్లుగా వుండటంతో అక్కడకు పోలీసు ఎస్.ఐ. తమ సిబ్బందితో వచ్చి చావు బ్రతుకుల మధ్య వున్న పాపను కాకినాడ ఆసుపత్రికి తానే స్వయంగా తీసుకెళ్ళి జాయిన్ చేశారు. అయితే పోలీసు వారు, పత్రికా విలేకర్లు సంఘటన వాస్తవ స్థితిని పరిశీలించిన తర్వాత ఇది వింత జంతువు పని కాదని మనుషుల పనేనని చెప్పారు. దానికి అక్కడ ప్రజలు, ఆ పాప తాలూకు పెద్దలుగాని అంగీకరించక మీరు చెప్పేది సరికాదని అది కచ్చితంగా వింత జంతువేనని తమ వాదన వినిపించారు. ఆ రోజు నుండి ప్రజల్లో భయం మరిన్ని కొత్త పుంతలు తొక్కింది. కొత్త కాలువ గట్టు అనే ప్రాంతంలో రాత్రివేళ ఒక స్త్రీపై వింత జంతువు దాడి చేసిందని ఆమె కింద పడిపోయిందని అక్కడ రక్తం కక్కుకుందని తెలియగానే జనం అక్కడ గుమిగూడారు. పడిపోయిన ఆ స్త్రీ పక్కన నేలపై వున్న రక్తాన్ని జనం చూసి ఇది రక్తం కాదని కుంకుమ కలిపిన నీళ్ళని తేల్చి చెప్పారు. ఆవిడను ఆసుపత్రికి తీసుకువెళ్ళగా డాక్టర్ పరిశీలించి ఆవిడ నోట్లో ఉన్నది రక్తం కాదని కుంకుమ నీళ్ళు అని కూడా చెప్పారు. ఇదంతా కొందరు కావాలనే ప్రజల్లో ప్రచారం చేస్తున్నారని కాస్త లోతుగా ఆలోచించే విజ్ఞానవంతులు తేల్చి చెప్పారు. వింత జంతువును పట్టుకోవడం కోసం అటవీ శాఖ వారు కొంతమంది సిబ్బందిని, జంతువును బంధించడానికి ఒక బోను, వలలను కూడా పంపించారు. పగలు, రాత్రి కూడా వారు ప్రజలు వింత జంతువు కనిపించిందన్న చోట్ల గాలించారు. వారు కూడా వింత జంతువు అనేది అసలు లేదని ఇవి కేవలం పుకారులు మాత్రమేనని నిర్ధారణకు వచ్చారు. ఆయా ప్రాంతాల ప్రజలు అది వింత జంతువు కాదని గాని, ఇది కేవలం మూఢనమ్మకమే అని గాని అంటే ప్రజలు తిరగబడేలా వుండటంతో తప్పేది లేక వారు కూడా వింత జంతువు సంచరించుతోంది అన్నారు.

ఇదిలా వుండగా పెద్దాపురం పట్టణంలో గల జనవిజ్ఞాన వేదిక నాయకులు భయాందోళనలో వున్న ప్రజలకు మానసిక ధైర్యాన్ని కల్పించేందుకు చెట్టిగ పేటలోని పెద్దలను సంప్రదించి అక్కడ చుట్టు పక్కల గల ప్రజల్ని పిలిపించారు. వారు చూసిన జంతువు ఏ రూపాన్ని కలిగి వున్నది ఎప్పుడు వస్తుంది అనే విషయాలను, జంతువు కరవటం వల్ల గాయపడిన వారిని తర్వాత జంతువు వివిధ రూపాల్లో మాకు

(మిగతా 14వ పేజీలో)

బొమ్మలో బొమ్మ

నేస్తాలూ... గత వారం చెప్పుకున్న మేజిక్ చేశారా? ఏమని తేలింది. రెండు టేబుళ్ల పొడవు, వెడల్పులు ఒకేరకంగా వున్నాయని తెలిసిందా! మరి అదే మేజిక్ అంటే. ఇవాల్టి మేజిక్ కూడా తక్కువదేంకాదు. భలే తమాషాగా వుంటుంది. అదేసమయంలో మిమ్మల్ని బాగా ఆలోచింపచేస్తుంది.



ముందు ఈ బొమ్మను చూడండి. ఏం కనిపిస్తోంది? 'ఏముంది? ఒక అమ్మాయి నెత్తమీద క్యాండిల్ పెట్టుకుని ఫొటోకి పోజు ఇచ్చింది' అంటున్నారా? ఒకటికి నాలుగు సార్లు చూసి చెప్పండి. ఆ తర్వాత మళ్లీ 'ఇష్...' అనుకుంటూ చేతులు విదిలించకూడదు. 'అబ్బా! ఎన్ని సార్లు చూసినా అంతేనండి. ఆ ఫొటోలో వున్నది ఒక్క అమ్మాయే' అంటున్నారు బల్లగుద్ది మరీ. సరే. ఇప్పుడు నేనొక మంత్రం చెప్తా అనండి. 'అబ్రకదబ్రా... అబ్రకదబ్రా...! ఒక అమ్మాయి దబ్రా ఇద్దరు కావాలి దబ్రా' అన్నారా. ఇప్పుడు ఫొటో మధ్యలో మీ అరచేతిని నిలువుగా పెట్టి చూడండి. ఎలా కనిపించింది. 'అరే! మంత్రం చదవంగానే అచ్చుగుద్దినట్టు ఒకేలావున్న ఇద్దరు అమ్మాయిలు ఎదురుబొదురుగా వున్నట్లు అగుపిస్తున్నారే?' అంటున్నారు చాలామంది. మరి అదే. ఇందాక నేను చెప్పింది. ఇదంతా ఆ ఆర్టిస్టు అంకుల్ గొప్పతనమే. ఆయన వేసిన బొమ్మ మన కళ్లను దర్జాగా మోసం చేసింది. అంతే. ఇందులో మంత్రం లేదు. మాయా లేదు. మంత్రం చదవకుండానే చెయ్యి నిలువుగా పెట్టి చూసినా అలాగే ఇద్దరు అమ్మాయిలు కనిపిస్తారు.

మేజిక్! మేజిక్!!

రంగులు అద్దుతారా



చిన్నారి చిత్రకారులు



ఎన్.రవి, 6వ తరగతి,
పెద్దాపురం, తూగో.



ఎ.సాయికుమార్, 6వ తరగతి,
పుల్లలచెరువు,
ప్రకాశం.



శ్రీరామ్, 8వ తరగతి,
హరిపాలెం, విశాఖ.

ఎ.ప్రశాంత్,
వెలిమనేడు,
నల్లగొండ.

క్విజ్-88

1. **విశాఖపట్నంలోని తూర్పు కొండలను ఏ పేరుతో పిలుస్తున్నారు?**
   ఎ. సింహాచలం బి. తూర్పు కనుమలు
2. **ఎక్కువ రైలు మార్గాలను కలిపే కూడలిని ఏమంటారు?**
   ఎ. జంక్షన్ బి. రైల్వే స్టేషన్
3. **మంచు ఎడారులను ఏమంటారు?**
   ఎ. టండ్రాలు బి. ఇగ్లూలు
4. **తిండికోసం మాత్రమే పండించే పంటలను ఏమంటారు?**
   ఎ. నగదు పంటలు బి. ఆహార పంటలు
5. **సీతాఫలాలకు ప్రసిద్ధి చెందిన జిల్లా?**
   ఎ. గుంటూరు బి. మహబూబ్‌నగర్
6. **విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఏ దేశపు సహాయంతో నెలకొల్పారు?**
   ఎ. పూర్వపు సోవియట్ యూనియన్ బి. అమెరిక
7. **ముఖ్యమంత్రిని ఎవరు నియమిస్తారు?**
   ఎ. రాష్ట్రపతి బి. గవర్నర్
8. **ఏ దేశాన్ని లౌకిక రాజ్యం అంటారు?**
   ఎ. మత ప్రమేయంలేని
   బి. మత ప్రమేయంవున్న
9. **నాలుక ముందు భాగం గుర్తించే రుచి?**
   ఎ. తీపి, ఉప్పు
   బి. పులుపు
10. **ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?**
    ఎ. రాహుల్ ద్రావిడ్
    బి. వివిఎస్.లక్ష్మణ్



క్విజ్ 87కి జవాబులు

1. గంగ 2. గ్లోబు 3. స్వేద రంధ్రాలు 4. లాలాజలం 5. తడి 6.వడ్రంగి పిట్ట 7. 500 8. ఎండాకాలమే 9. న్యూయార్క్ 10. తస్లీమా నస్రీన్

క్విజ్ 86కి సరైన సమాధానాలు రాసిన వారు :

యు.యు.బాబునరేంద్రప్రసాద్,**జె.గాయత్రి**, **పి.షహనాజ్‌సల్మా**, 10వ తరగతి, ఎమ్మిగనూరు. **కాలువ శ్రీఅనూహ్య**, 5వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **కె.కావ్య**, పటమట, విజయవాడ. **జయనాగేశ్వరి**, 10వ తరగతి, కాశీబుగ్గ, శ్రీకాకుళం. **నూకాల తనూజ**, 7వ తరగతి, అరసవిల్లి, శ్రీకాకుళం. **పి.గోకుల్**, 8వ తరగతి, తిరుపతి. **బి.జయనాగేశ్వరి**, 6 తరగతి,కాశీబుగ్గ.

కలం స్నేహం

పేరు: చందంపేట సంతోష్‌కుమార్,
వయసు : 14 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : క్రికెట్ , కబడ్డీ ఆడడం, కథలు చదవడం.
పూర్తి చిరునామా :చందంపేట సంతోష్‌కుమార్, సన్నాఫ్ రాములు, శివాజీరోడ్, జోగిపేట, 502270.

పేరు: వి.చంద్రయ్య,
వయసు : 16 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : క్రికెట్, వాలీబాల్ ఆడడం, పేపరు చదవడం.
పూర్తి చిరునామా :వి.చంద్రయ్య, 10వ తరగతి, గుండాల జడ్‌పిఎస్ఎస్ స్కూల్, ఖమ్మం.

కలం స్నేహం చేయాలని వుందా!

మరి ఆలస్యం ఎందుకు?
ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా: బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

కొమ్ము కీటకం



బీటిల్స్ అనే జాతి కీటకాల్లో చాలా రకాలున్నాయి. కానీ హెర్క్యులిస్ బీటిల్ అనే ఒక కీటకపు జాతి మాత్రం వాటన్నిటిలోకి ప్రత్యేకమైంది. ఈ జాతిలో మగ పురుగులకు తలపైన రెండు కొమ్ములవంటి నిర్మాణాలు పొడుచుకు వస్తాయి. ఈ పురుగుల శరీరంలో సగానికి పైగా 'కొమ్ము'లుంటాయి. ఇందులో అతిపెద్ద బీటిల్ దక్షిణ, మధ్య అమెరికాల్లో కనిపిస్తుంది. ఇది 19 సెంటీమీటర్ల పొడవుంటుంది.

పులి-బ్రాహ్మణుడు

విష్ణుశర్మ, ముగ్గురు రాకుమారులు ఒక మర్రి వృక్షం నీడలో కూర్చున్నారు. విష్ణుశర్మ వారివైపు ప్రేమగా చూచి 'రాకుమారులారా! మంచి స్నేహితులుంటే ఎంతటి ఆపదలనుంచైనా బయటపడవచ్చు. పూర్వం ఒక కాకి, ఎలుక, లేడి, తాబేలు మంచి మిత్రులు కాబట్టే.... పెద్ద ఆపద నుంచి బైటపడ్డాయి. జంతువులు, పక్షులలో అయినా సరే మంచి గుణాలుంటే మనం నేర్చుకోవచ్చు' అన్నాడు విష్ణుశర్మ.

అప్పుడు రాకుమారులు ఎంతో ఆతృతతో... 'కాకి, ఎలుక, తాబేలు, లేడి ఏ ఆపద నుంచి బైటపడ్డాయి? మాకు తెలుసుకోవాలని వుంది గురువర్యా!' అన్నారు. ఆయన వెంటనే చిరునవ్వుతో కథ మొదలుపెట్టాడు. గోదావరి నది ఒడ్డున ఓ పెద్ద బూరుగు చెట్టు వుంది. ఎక్కడెక్కడినుంచో వచ్చిన పక్షులు ఆ చెట్టుమీద విశ్రాంతి తీసుకుంటుంటాయి. అలా ఆ చెట్టు మీద కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న లఘుపతనకమనే కాకికి అటూత ఇటూ తిరుగుతున్న వేటగాడు కనిపించాడు.

'పొద్దున్నే లేచి వీడి ముఖం చూశానే. ఏ ఆపద రానుందో ఏమో! వెంటనే ఇక్కడినుంచి వెళ్లిపోవాలి' అనుకుంది కాకి. వేటగాడు అప్పటికే చెట్టుకింద నూకలు చల్లి వాటిమీద వలవేసి పక్కనే వున్న పొదలో నక్కి కూర్చున్నాడు. ఇంతలో చిత్రగ్రీవుడనే పావురం ఆకాశంలో ఎగురుతూ నేలమీది నూకలుచూసి 'ఈ అడవిలోకి నూకలు ఎలా వచ్చాయబ్బా! మనం మాత్రం వాటినిచూసి ఆశపడవద్దు. పూర్వం ఒక బ్రాహ్మణుడు బంగారు కంకణంకోసం ఆశపడి పులివాతపడి చచ్చాడు' అంటూ కథ మొదలెట్టింది.

ఒక ముసలిపులి చెరువులో స్నానం చేసి గట్టున నిలబడింది. అటుగా వెళుతున్న బ్రాహ్మణుడితో 'ఓ బాటసారీ! ఇదిగో బంగారుకంకణం తీసుకో' అంది. పసిడి కంకణాన్ని చూడగానే అతనికి ఆశకలిగింది. కానీ 'నువ్వేమో మనుషులను చంపి తినే క్రూర మృగానివి. నిన్ను నమ్మితే ఇంకేమైనా వుందా?' అన్నాడు అనుమానంగా.

'అయ్యో! నేను కుర్రవాడిగా వున్నప్పుడు ఎన్నో ఆవులను, ఎందరో మనుష్యులను తిని ఎంతో పాపం చేశాను. తర్వాత ఒక పుణ్యాత్ముడు 'ఇకనైనా మంచి పనులు చేస్తే బాగుపడతావ్' అని చెప్పాడు. అప్పటినుంచి పాపాలు చేయడం మానేసి మంచి పనులు చేస్తున్నాను. నీవు పేదవాడివి కాబట్టి ఈ బంగారు కంకణం నీకు దానం ఇవ్వాలనుకుంటున్నాను. చెరువులో స్నానం చేసి వచ్చి ఈ కంకణం తీసుకో. రేపో మాపో చావబోయే నన్ను చూసి బాధపడతావెందుకు?' అంది పులి. ఆ మాటలు నమ్మి పేరాశతో ఆ బ్రాహ్మణుడు స్నానం చేయడానికి చెరువులో దిగాడు. వెంటనే బురదలో కూరుకుపోయాడు.

అప్పుడు పులి 'అయ్యో! బురదలో కూరుకుపోయావా!! ఎంత పని జరిగింది? భయపడకు. నేను నిన్ను పైకి తెస్తాను' అంటూ బ్రాహ్మణుని దగ్గరకు వెళ్లి ఒడ్డుకు లాక్కొచ్చి ఎంచక్కా తినేసింది. దురాశ దు:ఖానికే కాదు. ఒక్కోసారి దుర్మరణానికీ కారణం అవుతుంది' అని చిత్రగ్రీవుడనే పావురం కథ ముగించింది.

అజ్ఞానం సృష్టించిన వింత జంతువు

(10వ పేజీ తరువాయి)

కనిపించిందన్న వారి తోనూ మాట్లాడించారు. అదంతా విన్న తర్వాత వారిలో వున్న ఆందోళన, భయాన్ని నిద్రాహారాలు మాని వారు తిరగటాన్ని గమనించిన జనవిజ్ఞాన వేదిక పెద్దాపురం నాయకులు ప్రజలకు, పెద్దలకు వారు ఏమీ కంగారు పడవద్దని చెప్పారు. అప్పటి నుండి జనవిజ్ఞాన వేదిక నాయకులు ఆందోళన చెందుతున్న ప్రాంతాల ప్రజల్ని ప్రతిరోజూ రాత్రివేళ వెళ్ళి ధైర్యం చెప్పి రావటం జరిగేది.

ఈ వింత జంతువు ప్రచారం పెద్దాపురం నుండి సామర్లకోటకు విస్తరించింది. అక్కడ ప్రజలు కూడా భయభ్రాంతులు కాసాగారు. ఒక మేకను చంపేసిందని, ఒక కుర్రాడ్ని కొరికేసిందని చెప్పారు. సామర్లకోటలో జరిగింది నిజమా? కాదా? అని తెలుసుకుంటే అదంతా ప్రచారం తప్ప ఏమీ లేదని పెద్దాపురంలో రోజురోజుకూ దాని ప్రభావం తగ్గుతూ వున్నా గానీ సంఘటన జరిగిన ప్రాంతాల వారు మాత్రమే ఇంకా వుందని అది పోవాలంటే పెద్ద భూతవైద్యున్ని తీసుకొచ్చి పూజలు జరిపిస్తే గాని పోదనే నమ్మకం బలీయంగా ఏర్పడింది. ఆ కోణం నుంచే వారు ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో ఎవరికో ఒకరికి కనిపిస్తోందని చెబుతున్నారు. నవంబర్ 23 ఆదివారం అమావాస్యని ఆ రోజు వింత జంతువు ప్రభావం ఎక్కువగా వుంటుందని ఆ రాత్రంతా కాపలా కాసి దాని అంతు చూడాలని ఊరంతా ప్రచారం చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో కూడా ఈ ప్రచారం ప్రబలంగానే వుంది. ఆ రాత్రి స్థానిక ప్రజలతో పాటు, జనవిజ్ఞాన వేదిక వారు కూడా సుమారు 20 మంది దళంగా ఏర్పడి బ్యాటరీ లైట్లతో స్థానిక ప్రజలకు సహకారంగా రాత్రంతా తిరిగారు. ఇదంతా శాస్త్రీయ ఆలోచనకు భిన్నం. అయినా నిరక్షరాస్యులైన పేద ప్రజల్లో బలీయంగా వున్న భయం కారణంగాను, అభద్రతా భావం కారణంగాను, మొదటి నుండి వారికి సహకరిస్తూనే ఆదివారం రాత్రి కూడా వారితో పాటు వున్నారు. చివరకు ఆ రాత్రి ఏ వింత జంతువూ లేదు. ఇదంతా వారిలో వున్న భయం, అపోహలే అని వేదిక నాయకులు తేల్చి చెప్పారు. అయినప్పటికీ భూతవైద్యుల చేత పూజలు జరిపించి మంత్రించిన కోళ్ళను చుట్టుపక్కల ఇళ్ళ వారికి పంచారు. శాస్త్రవిజ్ఞానం ఎంతవేగంగా పెరుగుతోందో, ప్రజల్లో మూఢనమ్మకాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయని పెద్దాపురం ఘటనలు రుజువు చేస్తున్నాయి. జనవిజ్ఞానవేదికతో పాటు ప్రభుత్వం కూడా ప్రజల్లో మూఢ నమ్మకాలు పారదోలడానికి కృషి చేయాలి. లేకుంటే పెద్దాపురంలాంటి సంఘటనలు పదే పదే జరుగుతూనే ఉంటాయి. సమాజంలో అలజడి సృష్టించి ఆనందించే స్వార్థపర శక్తులు ఎప్పుడూ పొంచి ఉంటాయి. ●

యాది (కొచ్చిండు)

(9వ పేజీ తరువాయి)

సంది కుత్తుకలో కొట్లాడుతున్న మాట. వచ్చిబోతున్న ఆ పోరగాడితో బైటపెట్టిండు.

"ఏంబాబూ! నీజీతమెంత!?"

"అన్నంబెట్టి ఐదువందలు."

ఆ మాట ఇనంగనే తన మొగం జెరంత గర్వంతో ఎల్గిబోయింది. అంటె "తనకొడుకు యాదిగాడికి అన్నంబెట్టి ఆరువందలు"... ఎక్కువగా ఉన్న ఆ వంద మొగం ఎల్గటానికి కారణం. చాయితాగిండు. మల్లో బీడీ ముట్టించాడు. ఎదురుంగ ఒకాయన వచ్చి గూసోంగనే తాగిన సగం బీడీని కాలికిందేసి నలిపిండు. "ఏంగావెలె సారు. ఇడ్లీ, వడ, పూరీదోస ఉప్మా గరం గరం"... అన్నడు పిల్లగాడు.

"అవేం వద్దు. ఒక చాయి తీస్కురా!" అన్నాడు మృదువుగా ఆ పెద్ద మనిషి. వడివడిగా నడ్సుకుంట వెళ్ళినంత స్పీడుగా చాయ్ తీస్కొని వచ్చి టేబుల్ మీద బెట్టుంటే, చెయిజారి ఆర్డర్ జేసినాయిన మీద వొల్కింది. వేడి తగ్గడానికి పక్కనున్న గిలాస్‌ల నీళ్ళు పద్ద దగ్గర దబ్బున బోసుకుండు. వెళదామని లేసిన పోశయ్య ఆ పద్దెమన్సి ఎమంటాడోనని ఆగి ఆసక్తిగా సూడబట్టిండు. కౌంటర్ మీదున్న వోనర్ గిది జూసి ఉర్కొచ్చిండు.

"ఏం రా.....! మెల్లిగా తెస్తె ఏం బుట్టిందిరా! సార్ అంగీ మీద బోసినవ్" అన్నాడు ఆవేశంగా గుడ్లురిమి చూస్తూ. ఆ పిల్లగాడు బుగులుబుగులుగా సూస్తు భయంతో వణికిబోతున్నాడు. ఆ పెద్దమన్సి నిమ్మలంగ "పోనీలెండి! కావాలని పోయలేదుగా!" అన్నాడు. 'గదిగాదు సార్! ఈ బాడ్‌కోవ్‌కు ఎన్నిసార్లు జెప్పినగింతె. మెల్లెగా తెవాలిరా అని జెప్పిన. ఈ చేతకాని.... కొడుకులు పన్కి ఎందుకొస్తరో ఎమో! వూళ్ళో ఉంటూ బర్లుగాసుకుంట ఉండక... నడ్వబె లోపల్కి నడ్వు" అంటూ చెంపమీద ఒక్కటిచ్చిండు. గాదెబ్బకు చెండు లెక్కల టేబుల్ మీద పడ్డడు. చెంపమీద ఐదు ఏళ్ళు గుర్తులతో బూరెల పొంగింది. జరసెపయినంక కనుబొమ్మపైన పద్ద గాటు నుండి రగ్తం కారసాగింది. టేబుల్ కొస కోసుకుపోయి ఉండొచ్చు. చెంపలమీద కెళ్ళి జారి అంగీని తడిపేస్తుంది. గూర్చున్న పెద్ద మన్సి దబ్బున లేసి, "ఏం మనిషివయ్యా!? అట్లా కొట్టావ్?" అన్నాడు ఆవేశంగా.

"......" జేబులో కర్చీఫ్ తీసి గాయిం దగ్గర అదిమి పట్టి నీళ్ళు తాగించిండు. "చిన్న కుర్రాడిని అంత దెబ్బకొట్టడానికి నీకు మనసెలా వచ్చిందయ్యా! ఎదో చెయ్యిజారి మీది సడింది. అంతేగాని పోయాలని పొయ్యలేదుగా!"

"అదిగాదు సార్" ఏదో సర్దిజెప్పాలని జూసిండు వోనర్.

"ఐనా పద్ద నేనే ఏం అన్లేదు. నువ్వేంటి అలా రెచ్చిపోయి కొట్టావు. దూరంగా వున్న వాడి అమ్మ, నాన్నా వచ్చి అడగలేరనే ధీమాతోనే కదా! ఇలాంటి పసివాళ్ళను పనిలో పెట్టుకోవడమే తప్పు. అదీగాక ఇలాంటి అఘాయిత్యాలు. ఒకవేళ అదే దెబ్బ కణితికి తగిలితే వచ్చి వూరుకునే వాడు. ఐనా నీలాంటి కసాయి వాళ్ళకు జెప్పిన ఒకటే, చెప్పకున్నా ఒకటే!' ఆ పిల్లవాడు వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. "ఏం బాబూ ఇక్కడే ఉంటావా! నాతో వస్తావా!"

వాడు కొద్దిసేపటికి నోరు పెగిలించుకొని "నేనిడ ఉండ మీ ఎంబటె వస్తా!" అన్నాడు ఏడుస్తూ. "అదీగాదు సార్!" మీరు తీసుకెళ్తె బాగుండదు. వాళ్ళ నాయినకు సంవత్సరం పైసల్ ముందుగాల్నె ఇచ్చిన."

"ఇస్తే వాళ్ల నాయిన్నతోనే పని చేయించుకో!. నువ్వేమన్నా అడ్డు చెప్పినా బాల కార్మికులనేరం కింద నిన్ను బొక్కలో పెట్టిస్తాను జాగర్త!" అన్నాడు హెచ్చరిస్తూ '....." బైటికి నడిచారు. వాళ్ళతో పాటే పోశయ్య కూడా.

ఒక దగ్గరున్న సిమెంట్ దిమ్మపై ఆ కుర్రాడిని కూర్చుండబెట్టి "బాబూ! నా వెంబడి వస్తే నీకు చదువు చెప్పి బడిలో వేస్తా! అక్కడే వాళ్ళు నీకు భోజనం పెడ్తారు. అక్కడ నువ్వు పని చెయాల్సిన అవసరం ఉండదు. ఇలా కొట్టే వాళ్ళూ ఉండరు. ఏమంటావ్!?" అన్నాడు భుజాల మీద చేయి వేసి లాలనగా. సరేనన్నట్టు తల ఊపాడు ఆకుర్రాడు. ఇదంతా చూసిన పోశయ్యకు పట్నంల ఉన్న కొడ్కు యాదయ్య యాదికొచ్చిండు. ఆడి దగ్గరికి ఈనడ్మ ఎళితె రెండు మూడు దెబ్బలు గన్పించినవి. వచ్చెటప్పుడు ఇంటికోస్త నాయినాని ఎడ్వబట్టిండు. ఐనా ఆడ్ని ఆడ్నే ఇడ్సిపెట్టి వచ్చిన. ఎందుకు ఎడ్సిండో ఎందుకు వస్తనన్నడో గిప్పుడు మెల్లెమెల్లెగా సమజైతుంది పోశయ్యకు. తన కొడుకూ సదవాలె. పట్నంల ఉన్న ఆడ్ని ఇయ్యాలె తీసుకురావాలె! అనుకుంటూ తన కొడుకు ఇషయం జెప్పటానికి ఓసారూ... జరసేపాగండి..!" అని కూతేసిండు పోశయ్య. ●

✻ ముదిగంటి సుజాతారెడ్డి

అంతా భూభారాన్ని దించడానికే!

అమెరికా తూర్పు ప్రాంతంలో కరెంటు పోయి రెండు రోజుల తర్వాత సాధారణ పరిస్థితి ఏర్పడటం, ఎండ తీవ్రతకు ఫ్రాన్స్‌లో పదివేల మందికి పైగా చనిపోయారని తెలిసిందగ్గర్నుంచి మన దేశ నాయకులకు చాలా ఆత్మవిశ్వాసం వచ్చేసిందేమోననిపిస్తుంది. అమెరికాలోనే దిక్కులేదు మనకెక్కడిదని మొండికేస్తున్నారు. ఎందుకంటే భోరున వర్షాలు పడి వదుల్లో చనిపోయినా, రైలు పట్టాలు తప్పి వందల్లో చనిపోయినా, విషజ్వరాలతో లెక్కలేనంత మంది చనిపోయినా ఓస్! అంతేగద – అని చప్పరించేస్తున్నారు. మొన్న మన దగ్గర ఎండాకాలంలో ఉష్ణోగ్రత యాభై డిగ్రీలకు మించిపోయింది చాలా ప్రాంతాల్లో. తాగడానికి నీళ్ళు దొరక్క జనం తిప్పలు పడ్డారు. నీళ్ళు దొరక్కపోతే ఏంటి ఏ బాటిల్ నీళ్ళో, కోకాకోలానో, పెప్సీనో తాగండి అని ఫ్రాన్స్ మహారాణి మేరీ ఆంటోనేట్ ఫ్రెంచ్ జనానికి బ్రెడ్ దొరక్కపోతే కేకులు తినండి అన్నట్లు నాయకులు సమస్యను అలవోకగా తీర్చేసినట్లు ఫోజు పెట్టి సలహాలిస్తున్నారు. ఆ కోకాకోలా, పెప్సీలలోనో పురుగుల మందు వుందని తెలిసినప్పుడు ఓస్! పురుగుల మందే గద! – అదీ చాలా కొద్ది మాత్రమేగా వుంది ఏమీ కాదు, భయం లేదు – అని అటు ఆ పానీయాలను తయారు చేసే వాళ్ళకు, తాగేవాళ్ళకు ఆశ్వాసన ఇచ్చారు. ఇక రైతులు కరెంటు కావాలని ధర్నాలు చేస్తే అమెరికాలోనే కరెంటు లేదు మనకెక్కడిదని చెప్పి నోర్లు మూయించారు. అదే మన రాజకీయ నాయకుల ఆత్మవిశ్వాసం!

సరే! – మళ్ళా మొదటికి వద్దాం. ఫ్రాన్స్‌లో పదివేలకు పైగా జనం చనిపోతే వాళ్ళను పాతిపెట్టడానికి వసతుల్లేక మరణించాక జరిగే ఆఖరి కర్మకాండలు చేసే ఫాదర్‌లు లేక చాలా కష్టాలు పడ్డారట! – జస్ట్‌లైక్ అస్ – ఎట్లా అంటే – గోదావరి పుష్కరాల సమయంలో అనుకున్నట్లుగా లక్షల్లో లేక కోట్లల్లో జనం వచ్చేసరికి పితృదేవతలకు పిండప్రదానాలు చేద్దామనుకున్న వాళ్ళు పురోహితులు దొరకక – కాదు... కాదు.. చాలక చాలా కష్టాలు పడ్డట్లుగా. అంతేగాక మన ఎండాకాలంలో యాభై డిగ్రీలు దాటిన వేడిలో (ఎందుకంటే ఫ్రాన్స్‌లో ఉష్ణోగ్రత నలభయ్యేనట!) చచ్చిన వాళ్ళు కొద్దిపాటి వందల్లోనే వున్నారు. అదీ ముసలీ బీదాబిక్కీ మాత్రమే! దానికీ పేదరికమే ఈ చావులకు కారణమని మన పత్రికల వాళ్ళు తాటికాయలంత అక్షరాల్లో వార్తలు వేశారు! మరి ఫ్రాన్స్‌లో మాటేమిటి!–అని నిలదీస్తున్నారు ధీమాగా రాజకీయ నాయకులు. మరి! ఒక్క గంటో అరో కరెంటు పోతే బేజారయిపోతారు మన జనం. చూడండి సాంకేతిక పరిజ్ఞానంలో ముందున్న అగ్రదేశంలో, ప్రపంచంలోనే అధిక ధనవంతమైన దేశంలో రెండు రోజులుగా కరెంటు పోతే ఎవరైనా కుయ్యిమన్నారా? – ఎంత క్రమశిక్షణతో మినరల్ వాటర్ కొనుక్కొని స్నానాలు, వంటలు కానిచ్చుకున్నారు! కాని చక్కగా కరెంటు వచ్చాక మాకు ఈ నష్టం జరిగింది, ఆ నష్టం జరిగిందని లక్షల్లో కోట్లల్లో పరిహారాలు ఇవ్వాలని కోర్టులకు పోయారు. మనకటువంటి తెలివి వుండి అడిగితేనో!-- అని అడిగితే అక్కడ ప్రతి నిమిషం చాలా విలువైందండి.. నిమిషం నిమిషం లెక్కలు వేసుకొని వాళ్ళ ఉత్పత్తులు సాగిస్తారు. అట్లా కష్టపడి పని చేస్తారు. మీరో! ఆఫీసుకు పోయి చేసేదేమిటి – ఆఫీసుకు పోంగానే ఛాయ్ దుకాణం దగ్గర కూర్చుంటారు. గప్పాలు కొడ్తుంటారు. కాబట్టి మీకటువంటి నష్టపరిహారం అడిగే మోరల్ హక్కే లేదు. అస్సలు మీరు ఎటువంటి కష్టాలనైనా నష్టాలనైనా అనుభవిస్తూ నోర్మూసుకొని పడి వుండాలి! – మీ కష్టాలను నష్టాలను విచారించాలని ప్రభుత్వాన్ని అడిగే హక్కేలేదు. సమ్మె చేసే హక్కు మొదలకే లేదు పో! అంటున్నారు... కోర్టులకు పోయినా మీకు న్యాయం జరగదు! అంటూ రాజకీయ నాయకులు అతి ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్తున్నారు.. ఇదంతా సినిమా రీలు లాగా నా మనస్సులో సాగింది. ఇంతలో రేడియోలో ఎక్కడో భూకంపం వచ్చి వేలమంది అపార్టుమెంటుల కింద కూరుకుపోయారనే వార్త చెప్తున్నారు. అంతే!– చూడండి! మీరు భూకంపం వచ్చి జనం చనిపోతే సరిగ్గా సహాయ కార్యక్రమాలు జరగలేదని ప్రభుత్వం విఫలమైందనీ మొత్తుకుంటారు. వాళ్ళని చూడండి ఎంత నిశ్శబ్దంగా వున్నారో!– అయినా ఇటువంటి వరదలు, భూకంపాలను, ప్రమాదాలను భూదేవి భారాన్ని తీర్చటానికే దేవుడు పుట్టిస్తుంటాడు! – అని అంటూ అభయాస్తంతో నిలబడిన రాజకీయ నాయకుడు నా కళ్ళ ముందు నిలబడ్డాడు. ఇది కలా? నిజమా? నాకెటూ అర్థం కాలేదు! ●



మగ మెగా మాయ

అమాయకత్వం ఆడతనంతో బుట్టువులని చెబుతారు! అంతమాత్రాన ఆడవాళ్ళంతా అమాయకులని సూత్రీకరిస్తే తొందరపాటే అవుతుంది. ఫలానా మంగతాయారు మహామేధావే కావచ్చు. ఆవిషయం ఆవిడ క్కూడా బాగా తెలిసుండవచ్చు. ఆవిడ్ని కట్టుకున్నవాడు మాత్రం జాగ్రత్తపడి మాయదారి బిరుదులిస్తూ వుంటాడు.

ఆ బిరుదుల్లో ఒకటి ఈ అమాయకత్వం!

నువ్వు గొప్ప తెలివిమంతురాలివని వాస్తవం చెబితే అది పొగడ్త అనుకునే ప్రమాదముందని గ్రహించి- నువ్వొత్త అమాయకురాలివని అట్నుంటి నరుక్కొస్తాడు. నల్లనివన్నీ నీళ్ళనుకుంటావ్... తెల్లనివన్నీ పాలనుకుంటావ్ అని... ఆ పాయింటుని అంత గొప్ప మేధావీ కాబోసనుకుంటుంది!

తెలివికంటే అమాయకత్వమే శ్రేష్టమని మంగతాయారు ఉద్దేశం!

ఆడవాళ్ళు అమాయకంగా వుంటేనే అందంగా వుంటారని ఆవిడెక్కడో చదివి వుంటుంది. అదే నిజమనుకుంటుంది. ఆ ముక్క రాసినవాడు మగవాడనే మాట మరిచిపోయి ఉంటుంది.

అంచేత-

మంగతాయారు ఓటు అన్నమానం అమాయకత్వానికే వేస్తుంటుంది!

ఆవెను అలా తయారు చేసినవాళ్ళు మొదట ఒక రచయిత- పెళ్ళయ్యాక ఆమె భర్త!

మగవారి మాయలని వాడుకలో ఒక మాట వుండనే ఉంది.

ప్రాసకోసం మగా అని మాయా అని అన్నారని కాదు. వాస్తవం కూడా యిదే! మాయలు చేయడం మగవాడి నైజం! ఆదికాలం నుంచీ ఈ రభస సాగుతూనే వుంది!

అంచేత మగవాడికి పర్యాపదం-మాయ!

అవసరం పడితే భార్యని నా భాగ్యదేవతవు నువ్వు అని అంటాడు. ప్రియే చారుశీలే అని పిలుస్తాడు. అవసరం తీరిపోగానే- ప్రియే చారుశీలే, భాగ్యదేవతా వగైరా పిలుపులు గాలిక్కొట్టుకు పోతాయి!

అప్పుడు-

హంసగమనా అన్న నోటితోనే

ఇప్పుడు-

కుంటి గుర్రమా అంటాడు!

అప్పుడు రంభా ఊర్వశీ అని పిలిచి ఇప్పుడు మొద్దూ దెయ్యమని పిలుస్తాడు.

ఇది ఇట్లా ఎందుకు జరుగుతోంది?

ఆడవాళ్ళకి తెలివి కంటే అమాయకత్వమే అందమైన ఆభరణమని ఇంటా బయటా వినిపించే నూక్తుల మూలంగా-ఈమె ఆ విధంగా తన జీవన విధానాన్ని మలుచుకుంది! స్వయంకృతాపరాధం!

ఈ నగ్న సత్యాన్ని గుర్తించి ఆడవాళ్ళు జాగ్రత్త పడాలి!

అలివేణీ నా రాణీ అనగానే ఉప్పొంగి పోకూడదు. క్షణం సేపు మనసు గుర్రానికి కళ్ళెం వేయాలి. అలివేణీ రాణీ అనే పదాన్ని ఎందుకు ఉపయోగిస్తున్నాడో అంచనా వేసుకుని జాగ్రత్త పడాలి! ఈ దిక్కుమాలిన పిలుపులకు మూల కారణం ఏమిటో ముందే ఊహించాలి!

నిన్న దెయ్యమని పిలిచిన మనిషి ఇవాళ దేవతంటున్నాడంటే- మాట నిలకడ లేని మనిషని జాలిపడ కూడదు. ఛీ పొమ్మంటే మనను చెడగొట్టకుని ఆత్మహత్య చేసుకుంటాడేమోనని భయపడకూడదు!

మనిషి మామూలుగా ఉన్నాడో, తూలిపోతున్నాడో గమనించాలి. అతగాడు అయినకాడికి లవంగాలూ, యాలక్కాయలూ నోట్లో వేసుకుని కసాపిసా నములుతుంటే- తప్పనిసరిగా జాగ్రత్తపడాలి. తప్పకుండా కూపీ లాగాలి.

జేబులు ఖాళీగా వున్నపుడు కూడా-మగమహారాజుకు తన అర్థాంగి కామధేనువు కల్పవృక్షం మాదిరిగానే కనిపిస్తుంది. అయిదో పదో ఆవిడ్ని అడుక్కోవాలంటే సిగ్గు పడతాడు. వంటింటో పోపుల డబ్బా వెతుక్కోవాలంటే నామోషీ తనం ఫీలవుతాడు!

అంచేత-

అట్నుంచి నరుక్కొస్తాడు!

నువ్వు లేని నా బతుకు చీకటని గాద్గదికంగా గొణుక్కుంటాడు. అప్పుడు-అంతంత మాటలనకండని ఆమె అతని నోరుమూస్తే అంతే సంగతులు!

పాతిక రూపాయలు నా జేబులో పెట్టు పార్వతీ వచ్చే ఫస్టుకి ఫిఫ్టీ కొడతానని లెక్కలు చెబుతాడు. చెట్టంత భర్త మహాశయుడు తనని దేబిరించడమే మహాభాగ్యమని మురిసిపోయి పోపుల డబ్బాలో చెయ్యి పెట్టిందంటే పెనుమాయలో పడిపోయిందని అర్థం.

ఆ మాయతెర-

ఫస్టు తేదీన గానీ తొలగిపోదు. అసలు పాతిక, దానిమీద వడ్డీ మాట దేవుడెరుగు. జీతంలో వంద తగ్గించి యిస్తాడు.

ఏమిటీ లెక్క అని అడిగితే నా ఖర్మంటాడు. జీతాలిచ్చే గుమాస్తా వందకాగితం నొక్కేసి వుంటాడని అభాండం అతని మీద వేస్తాడు! వాడి పని వచ్చే నెల్లో పడతానంటాడు.

వచ్చే నెల్లో ఎవరి దగ్గర ఎవరెంత పడతారో గాని భర్త అడిగినప్పుడల్లా అప్పులిచ్చే భార్యకి సుఖం లేదని నేను నొక్కి వక్కాణించి చెప్పగలను.

✻ రుక్మిణి

స్వర్ణాం(మద్యాం)ధ్ర ప్రదేశ్

ఆ సాయంత్రం మునిమాపువేళ తాగుబోతు గోవిందం కనకమాలచ్చి ఇంటి అరుగుమీద కూలబడ్డాడు. ఇక మాలచ్చితో మాటలు మొదలు పెట్టాడు. మాలచ్చి మాట్లాడితే ఒళ్ళంతా వూగిపోతుంది. ఎందుకంటే మాలచ్చి కూడా వూగిపోకుండా... పైట పలుమార్లు జార్చకుండా మాట్లాడలేదు కాబట్టి - ఎందుకంటే మాలచ్చి చేసే బ్రాందీ అమ్మకాలకి అదో అదనపు ఆకర్షణ గనక! ఇంకా ఎందుకంటే లైసెన్సూ... చండాలం లేకుండా బెల్టు దుకాణం నడిపి పారేస్తోంది గనక!

"గోవిందూ.. ఒక అరక్వార్టరు యివ్వనా!" మాలచ్చి గోముగా అడిగింది.

"ఏందోలెవె.. చీపులిక్కరు తాగి చానమంది లేచి పోతంద్రు.. గదితాగుడేందో... సచ్చుడేందో..." గోవిందం వేదాంతం కలబోసి అన్నాడు.

"చచ్చినార్లె... మాటలు.. మరయితే మరి నువ్వెందుకు పైకిపోలేదు. అన్నీ మాటలు... ఇండ్లకాడ పెండ్లాలతోని పంచాయితీలు పెట్టుకోటం... ఏ పురుగుల మందో నాకో.. విసంబిళ్ళలో చప్పరించటం... బద్నాం అంతా చీపులిక్కరు మీద.. అంతా రాజకీయం అయిపోయింది గోవిందూ.

"రాజకీయం అంటే ఏందో?" గోవిందం కాస్త వళ్ళు మండి అన్నాడు.

"వున్నవి లేనివి చెప్పటవే రాజకీయం.. మాయ... తాగుతవా.. లేదా? లేకపోతే పోనీయే గానీ... గా నూట పదహా(ర్రూపాయలు... పాతబాకీ... గవిగాని ఇస్తివా నీ ఇష్టం!" కళ్ళు చిటకాయించి పమిట ఓసారి పైకి సర్దుకుని మరీ అడిగింది మాలచ్చి... గోవిందం కోపాన్ని అణగదీసుకుని మామూలుగానే అన్నాడు.

"చూడుమాలచ్చీ.. నాకైతే లెక్కలు సరిగా రావనుకో... మీ డాక్రా మహిళలకు బాగా వస్తయిగానీ... ఏ దురదుష్టం రోజున... సరిగ్గా నాలుగేండ్ల కిందట్నుండి ఈ తాగుడు నాకు అలవాటయింది. అయితే అయింది! పైసలు ఖర్చయితే అయినాయి. నేనైతే తాగిన గద! ఇంటికాడ పెండ్లాం రోజు అరిచి గోల చేస్తే చేసింది... తాగినగద.. పోరగాండ్లు అరిచినా ఒక్క రూపాయి బిళ్ల వాండ్ల చేతుల బెట్టకపోతిని - తాగుబోతు ముండాకొడుకుని... కాని మాలచ్చీ.. రోజుకు క్వార్టరు.. ఆదివారం రెండు... నెలకు ముప్పయి రోజులు.... సంవత్సరానికి మూడొందల అర్వై అయిదు రోజులాయె... క్వార్టరుకు అర్రూపాయలు.. ఏడు రూపాయలు ఎక్కువ దొబ్బితే ఆ లెక్కన రెండు వేల అయిదొందల యాభై అయిదు సంవత్సరానికి... అసలు.. అంటే డబుల్ క్వార్టర్లు గాక.. నాలుగేండ్లకు పదివేల పైమాటే! చిల్లరమల్లర లెక్కలన్నీ అటెంక చూసుకుందాంగానీ...

మా లచ్చికి ఈ సోదంతా అర్థంగాక నోరు బార్లా తెరిచి అవాక్కయిన అక్కలా వింటూ నిలబడింది!

"ఆ పదివేలలో నీనూట పదార్లుకోసేసుకుని అర్జంటుగా మిగిల్ని పైసలు జల్ది పడెయ్... అవతల నాకు చాలా పనుంది...!"

తర్వాత పెద్ద రగడ జరిగింది. దారివెంట పోతున్న జక్కులోడు అనవసరంగా అక్కడ ఆగడంతో ఇద్దరూ పంచాయితీకి వాడివెంట పడ్డారు. రావిచెట్టు దగ్గరే గదా అని అక్కడికి జక్కులోడు వీళ్ళని వెంటేసుకుని చేరేసరికి యాద్గిరి బీడీపీకుతూ చప్టామీదనే కూలబడి వున్నాడాయె! మాలచ్మిగాక మరి నలుగురు బెల్టు దుకాణపోల్లుకూడా చిందులు తొక్కుతున్నారు. ముసలి



గురివిగాడు... యాకోబు... నర్సిమ్మ... అడపాదడపా మద్యం పుచ్చుకునే గ్యాంగంతా తమక్కూడా డబ్బులు కట్టి తీరాల్సిందేనని వీరంగం చేస్తున్నారు.

"యాద్గిరన్నా... ఏదో తాగుబోతులు... పైసలున్ననాడు రంగుసారా తాగుతాం! లేనినాడు గుడుంబా... అయితే గవి కల్తివో... చీపు లిక్కరో... పారినో మాకేమెరుక! ఎన్ని పైసలంటే అన్ని పైసలిచ్చి మూత పీకుతమాయె!"

''ఊరుకోండిరా... తాగింద్రు... అయిపోయింది గద!" జక్కులోడు సర్దిచెప్పబోయాడు. "గదే.. యాపారంలో నీతుండాలె.. మొన్న మా బామ్మర్ది మద్రాసు నుండి దొంగతనంగ రెండు మెగ్డోవల్ సీసాలు తెచ్చిండు - వాటికీ వీటికీ వంద రూపాయల తేడా! అదేంది.. అక్కడ కూడా అమ్మేది లైసెన్సు బ్రాంది షాపోల్లేనాయె!"

"అయ్యోరాత.. అక్కడంతా రూల్సు వేరు లేవయ్యా!" మాలచ్చి తెలివిగా ఓ అరువు అరిచి ఒడుపుగా పైట సర్దుకుంది!

"అదే అనుకున్నాం అక్కా. అయితే మాకు మొన్న పొద్దుగాల్నె ఓ మతలబు తెలిసింది. ఏందంటే ఈ బ్రాందీలు... విస్కీలు... ఓల్డుమాంకు రమ్ములు డ్రమ్ములు తయారయ్యేవి బెంగుళూరు కంపెనీలలోనే...

"అట్లనా!" జక్కులోడు వాడి పరిజ్ఞానానికీ... సమాచార సేకరణ పరిశోధనకి విస్తుపోయి కూలబడి మెచ్చుకోలుగా చూశాడు.

అట్లయితే తయారు చేసినోడు అందరికీ ఒకటే రేటుమీద అమ్ముతాడు... అమ్ముతాండు!" తర్వాత మళ్ళా ఓసారి అంతా గందరగోళమైపోయింది. ఒకళ్ళనొకలు బండబూతులు తిట్టుకుంటూ కుస్తీకి సిద్ధమైపోయారు. అపుడు యాద్గిరి గట్టిగా గదిరించేసరికి కాస్తంత చల్లబడ్డారు.

"అదికాదు అన్నా... కమీషను మీద అమ్మెటోళ్ళం... బెంగుళూరు మంగళవారాలు మాకేంటి? అంతేగద... వాళ్ళా తాగింద్రు. అయిపాయె! ఎవడిదైనా యాపారమే... లాభంలేందే ఎవడైనా ఎట్లా అమ్ముకుంటడు!" మాలచ్చి మళ్ళా వకీలు వాదన చేసింది. జక్కులోడు చప్పరించి 'ఇది సబబే' అని తన నిర్ణయాన్ని ప్రకటించాడు.

"యహె... నువ్వూరుకో... అసలు బ్రాంది... బూంది అన్ని యాపారాల్లాంటివి కావు - దీనికి గవర్మెంటు పర్మిషనూ... లైసెన్సులుండాలె... దాని లెక్కంత వేరే వుంటది గాదు. చేతులూపి వేళ్ళు చూపించగనె సరిపోదు...!" నర్సిమ్మగాడు అడ్డదిడ్డంగా వాగాడు.

"అదికాదె నర్సన్నా... మన జనాలు గుడుంబా పాడుసారా తాగి పేగులు.... తోలు మాడి చస్తున్నారనిగాదు మన చెంద్రబాబుగారు ఇట్లా మీకందరికీ మద్యం అందుబాటులోకి తెచ్చిండీ... ఇట్లా మన రాష్ట్రంలో మద్యం మీద ఎంత ఆదాయం పెరిగితే దాంట్లోంచే మన పోరగాండ్ల బడీ... సదువు ఖర్చులు వెళ్లిపోతయని మా మీటింగుల చెప్తె! మరి మీరేమో దొంగరేట్లంటరేందీ!"

దాంతో నర్సిమ్మ తొడలు లపలప చరిచి కదం తొక్కుడు మొదలు పెట్టాడు. "గదే... గదే.. ఇతర రాష్ట్రాల కన్నా మన రాష్ట్రం నుండి బ్రాంది కంపెనీ వాండ్లకు అధిక ధరలేసి రెండు వేల కోట్ల రూపాయలు ఎక్కువగా చెల్లింపులు చేసిండు. ఆ రెండువేల కోట్లలో ఏ మంత్రి ఎవనికి ఎంత దొరికితే అంతే మేసి పారేసింద్రు! మా తాగుడు 'యావ'ను ఎక్కువ చేసి - ఇట్లా మద్యంలో దండీ కొట్టింద్రు. మన ముఖ్యమంత్రి!" నర్సిమ్మ గోలగోలగా అరిచేసరికి మాలచ్చి మారు మాటరాకుండా నిరుత్తురరాలై బిక్కచచ్చిపోయింది. అంతా గోల!

"మాకు ఎక్కువ ధరలకందించింది పెద్ద బ్రాంది షాపు పచ్చబాబుగారు... మీరు పోయి ఆయన్ను అడగండి... మాకేంది! మరో బెల్టు బ్రాందివాడు బెల్టు మెలిక తిప్పంగనే యాద్గిరి కస్సుమని వాడ్ని కసిరాడు. "అరె.. పచ్చబాబుగారు చెంద్రబాబుగార్ని చూపిస్తడు. అసలు మూలం కుంభకోణం అక్కడుంది! అదిసరెగానిరా... అసలీ తాగుడుమాని పారేస్తే ఎవడూ సీసాలమ్ముకోడు... లాభాలు పీకరు... మీ కొంపలు సల్లగుంటాయి గద... గా పని చేయరాదుంద్రా తాగుబోతు గాడిదల్లార....

"అసలు సంగతి అది కాదన్నా... దీన్లో ఏదో 'విదేశీ కుట్ర' కచ్చితంగా వుందని నా అనుమా...నం!" మాలచ్చి మెరిసే కళ్ళలో ఇంకా ఏదో అనబోయేంతలో యాద్గిరి మెరుపులేని పిడుగులా గదమాయించాడు... 'నోర్ముయ్' అని తాగుడు మాన్పించడం మీద జోరుగా లెక్చరు దంచడంతో అందరూ బహుశ్రద్ధగా వినడం మొదలు పెట్టారు!

●

* ఎ.వి. శర్మ

శరీర సౌష్ఠవానికి- ఆకృతికి

వ్యాయామం

పట్టణాలలో ప్రతిరోజూ ఉదయం రోడ్లపై చకచక నడిచే వాళ్ళు, జాగింగ్ చేసేవాళ్ళు, పరుగెత్తే వాళ్ళు, నింపాదిగా నడిచేవాళ్ళు, నడవలేక నడవలేక నడిచేవాళ్ళూ.., వీరంతా వాకింగ్ చేస్తూ దర్శనమిస్తుంటారు. కొన్ని కొన్ని సెంటర్లలో ఎక్సర్ సైజులు చేస్తూ కన్పిస్తుంటారు. నాలుగు నెలల క్రితం షష్టిపూర్తికి దగ్గర్లో వున్న పెద్దాయన షుగర్ పేషెంట్ అయిన తన భార్యను హాస్పటల్‌కు తీసుకెళ్లాడు. డాక్టరు ఆమెను టెస్ట్ చేసి మందులు రాసి ప్రతిరోజూ వాకింగ్‌కు వెళ్లమన్నాడు. పెద్దాయన చేతులు నెప్పులూ, కీళ్ల నెప్పుల విషయం మనవి చేసుకున్నాడు. చేతులు పైకెత్తి గోడకానించి ఓపిక వున్నంత వరకు నిల్చోమని డాక్టరు సలహా. అది పెద్దాయనకు వ్యాయామం అవసరాన్ని గ్రహింప చేసింది. భార్యకోసం వాకింగ్‌కు ప్రతిరోజు వెళ్లేవాడు. భార్యచేత వాకింగ్ చేయించలేక పోయాడు- గానీ తను వాకింగ్, ఎక్సర్‌సైజులకు అలవాడు పడ్డాడు. మూడు నెలలు గడిచే సరికి శరీరంలోనూ, ఆకారంలోనూ మార్పు వచ్చింది. బానకడుపు సగం కరిగిపోయింది. చేతులు, కీళ్లు నడుము నెప్పులు లేకుండా పోయాయి. కాకపోతే వయసు రీత్యా వచ్చిన రుమాటిక్ పెయిన్స్ అప్పుడప్పుడు కన్పించినా గతంలా యిబ్బంది పెట్టటం లేదు. అంతే కాదు సంవత్సరాల తరబడి వీపు తోముకునేందుకు సహకరించని చేతులు ఈమధ్య అకస్మాత్తుగా వీపు తోమగలగటం ఆశ్చర్యంలో ముంచివేసింది.

హైస్కూళ్లలో ఆటలు, డ్రిల్లు, స్కౌటు, ఎన్‌సిసిలు పిల్లలకు వ్యాయామానికి వుపయోగపడేవి. ప్రస్తుతం చదువులు కొనే దుస్థితిలో ఆ అవకాశం సన్నగిల్లిపోయింది. కర్ర సాము, కత్తిసాము, మల్లయోధుల గరిడీల నుండి కరాటె, జూడో, కుంగ్‌ఫూ, బాడీ బిల్డింగ్, జిమ్నాజియం యోగా వగైరాలుగా వ్యాయామ శాలలున్నాయి. అవి అనేకానేక ఆధునిక పరికరాలతో విరాజిల్లుతున్నాయి. పసిపిల్లవాని కేరింతల నుంచి నృత్యం, ఈత వరకూ వ్యాయామం కోవలోనివే. గతం కంటే మెరుగైనా వ్యాయామం చేస్తున్న వాళ్లు అంతంత మాత్రమే.



బెల్టు సిస్టంతో పొట్ట తగ్గించుకోవటం, లేహ్యాలతో, టానిక్కులతో బలం చేకూర్చుకునే సునాయాస పద్ధతులుండగా వ్యాయామం అంటూ కష్టపడే కార్యక్రమం ఎందుకు అనేవారున్నారు. శ్రమ ఉత్పత్తికి మూలం. శ్రమ చెయ్యకుండా డబ్బు సంపాదించే విధానాలున్న సమాజంలో కష్టపడటం హీనంగా, నీచ నికృష్ట కార్యంగా భావించే సంస్కృతి మనలను ఏలుతూ వుంది. మానవులు నిత్యావసరాల వస్తువుల కోసం సాగించిన శ్రమ ఫలితమే నేటి ఈ సమాజం, మననాగరికత అనేది మేధావుల ఉద్ఘాటన. కోతిలో నుంచి మనిషి పుట్టాడని వింటుంటాం. ఒకేసారి కోతికి మనిషి పుట్టాడా అంటే లేదనే చెప్పాలి. కోతికర్రను భుజంపై పెట్టుకొని ముందుకాళ్లతో పట్టుకొని వెనుక కాళ్లతో నడవటం చూస్తూనే వుంటాం. మనిషిని ద్విపాద పశువనే నానుడి వుండనే వుంది. ఆహారం కోసం కోతి చేసే శ్రమ విన్యాసాల ఫలితంగానే అనేక సంవత్సరాల పరిణామ క్రమంలో కోతి నుంచి మానవరూపం విడివడిందనేది డార్విన్ సిద్ధాంతం. శరీర మార్పులకు శ్రమకీలక పాత్ర వహిస్తుంది. వ్యాయామం శ్రమతో కూడినది కాబట్టి ఆ మాత్రం కష్టపడగలిగితే శరీరాన్ని బలంలోనూ, ఆకారంలోనూ ఏమేరకు వుండాలో ఆమేరకు వుంచుకునే అవకాశం మన చేతుల్లోనే వుంటుంది.

సహజంగా వాకింగ్ పూర్తి చేసి ఎక్సర్ సైజులు చేస్తూ వుంటారు. యోగాసనాలు వేస్తే వాకింగ్, ఎక్సర్‌సైజులు చేయనక్కర్లేదనే వాళ్లూ వున్నారు. వాకింగ్‌కు ప్రత్యామ్నాయమే లేదంటారు కొందరు. ఎక్సర్ సైజులూ యోగాసనాల అనే కంటే చేసేది యేదైనా అన్ని అవయవాలనూ కదిలించేదిగా వుండాలి. పాదాలు, చీల మండలు, మోకాళ్లూ, నడుము, పొట్ట, మెడ, ముక్కు కళ్లు, కాళ్లూ, చేతులు మున్నగు అవయవాలను కదిలించగలిగేలా తేలిక పాటివైనా, సంక్లిష్టమైనవైనా చేయవచ్చు. మనసు లగ్నమయ్యే దాకా ఆషామాషిగా చేసినా తరువాత నుంచైనా ఎక్సర్‌సైజులు ఏది ఏరీతిలో చేయాలో అలాగే చేయాలి. శరీరానికి ఏది అలవాటు చేస్తే దానికే అలవాటు పడుతుంది. మొక్క ఎదిగేటప్పుడు ఏదైనా అడ్డం వస్తే దాన్ని తప్పుకొని పైకి ఎదుగుతూ పోతుంది. అడ్డం తగిలిన చోట మొక్క వంకరపోతుంది. అవయవాలకు 'వంకర' సోకకుండా జాగ్రత్త వహించాలి. దానికై ఎక్సర్‌సైజుల్లో కచ్చితత్వం పాటించాలి. ధ్యాస వుంచి పనిచేయాలన్నది పెద్దల మాట. కేంద్రీకరించి ఎక్సర్ సైజులు చేస్తే ఫలితాలుంటాయి. పొరపాట్లు అర్థం చేసుకొని సరిచేసుకుంటే కచ్చితత్వం అదే వస్తుంది. క్రమానుగతంగా నైపుణ్యం చోటు చేసుకుంటుంది. సృజనాత్మకత కొంగ్రొత్త ఎక్సర్ సైజులకు మార్గం సుగమం చేస్తుంది.

కొద్ది రోజులు వ్యాయామం చేసి నాకేమీ మార్పు కన్పించటం లేదని మానేసిన వాళ్లున్నారు. విత్తనం భూమిలో పడగానే మొలకెత్తదు. దాని వ్యవధి దానికి కావాలి. వాస్తవానికి మనం వ్యాయామం చేస్తున్న రోజు నుంచీ మన శరీరంలో మార్పులు జరుగుతూనే వుంటాయి. అవి మనం గుర్తించేటంతగా వుండవు. అలాంటి మార్పులు అనేకం జరిగిన పిదప మనం గుర్తించే విధంగా మార్పు కనిపిస్తుంది. ఓర్పుగా చేస్తుంటే ఫలితం తప్పక పొందుతాము. కొంతమంది వ్యాయామం చేస్తున్నా పొట్ట తగ్గటం లేదంటుంటారు. అది వ్యాయమం తప్పుకాదు పొట్ట నిండా ఆహారాన్ని కుక్కటం మంచిది కాదు. ఒక ముద్ద ఖాళీ వున్నప్పుడే లేవటం శ్రేయస్కరం. మితంగానైనా పుష్టికరమైన ఆహారం శ్రేష్టం. భోజనం చేయగానే మంచినీళ్లు త్రాగే అలవాటు ఎక్కువమందిలో వుంటుంది. భుజించిన ఆహారం జీర్ణమయ్యేందుకు సుమారు రెండు గంటలు పడుతుంది. ఆ రెండు గంటలూ త్రాగిన నీరు పొట్టలోనే వుండి పోతుంది. అందువల్ల బ్లాడరు సాగి పొట్ట పెరుగుతుందే తప్ప తరగదు. ఖాళీ పొట్టకు నీళ్లు తాగితే యిరవై ముప్పై నిమిషాల్లో పొట్ట ఖాళీ అవుతుంది. కావున భోజనం చేయబోవడానికి ముప్పయి నిముషాల ముందు నీళ్లు త్రాగే అలవాటు చేసుకోవాలి. "నీరు- ఆహారం" నియమాలు పాటిస్తే వ్యాయామం ద్వారా సులువుగా పొట్ట తగ్గించుకోవచ్చు. వృద్ధులకు వ్యాయామం వల్ల వుపయోగం లేదనేది కొందరి ఉవాచ. కండలు పెరగక పోయినా మంచంలో పడి తీసుకునే పరిస్థితి రాకుండా చూసుకునే అవకాశం వుంది. తేలికపాటి ఎక్సర్‌సైజ్‌లు వాకింగ్‌తోపాటు చేసుకుంటే సరిపోతుంది. రోగం వచ్చిన తరువాత డాక్టర్ల వద్దకు వెళ్లేకంటే రోగం రాకుండా చూసుకోవటం ఉత్తమం. వ్యాయామం చేయడానికి వీలైన తక్కువ వాతావరణ కాలుష్యం వుండే ఏరియాను ఎన్నుకోవటం ముఖ్యం. అందుకోసం అనునిత్యం వాడే కాస్మోటిక్స్ కంటే క్రమబద్ధంగా చేసే వ్యాయామం శరీర సౌష్టవంతో పాటు ఎత్తుకు తగ్గ లావుతో ఆరోగ్యంగా అందంగా వుత్సాహంతో ఎవర్ గ్రీన్‌గా వుంచుతుంది. మీ చర్మ సౌందర్యానికి రహస్యం ఏమిటి అని ఎవరైనా అడిగితే "వ్యాయామమే" అని టక్కున చెప్పేలా ఆరోగ్యమే మహాభాగ్యమనే సూక్తిని సార్థకం చేసుకోవచ్చు. ●

✻ కె.గడ్డెన్న

గుజరాత్ మారణకాండపై విచారణ నివేదిక

మతోన్మాదంపై పోరాడినందుకు నాడు గాంధీని పొట్టన బెట్టుకున్న శక్తులే 2002 ఫిబ్రవరి 27 గోద్రా ఘటనను సాకుగా చేసుకుని గుజరాత్‌లో దారుణ మారణకాండకు తెగబడ్డాయి. ప్రపంచంలో భారత దేశ పరువు ప్రతిష్ఠలను మంటగలిపిన ఈ క్రూరాతి క్రూరమైన హత్యాకాండకు సంబంధించి కొన్ని విషయాలు మాత్రమే మీడియాలో వచ్చాయి. మీడియా దృష్టికి రాని అనేక చీకటి కోణాలను కన్సెర్న్డ్ సిటిజన్స్ ట్రిబ్యునల్ వెలుగులోకి తెచ్చింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి ఆర్ కృష్ణ అయ్యర్ నేతృత్వంలోని ఈ ట్రిబ్యునల్‌లో జస్టిస్ పి బి సావంత్(సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జి),జస్టిస్ హోస్బెత్ సురేష్(ముంబయి హైకోర్టు రిటైర్డు జడ్జి), సీనియర్ అడ్వకేట్ కె.జి కన్నాభిరాన్(పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ అధ్యక్షులు), శ్రీమతి అరుణా రాయ్(మజ్దూర్ కిసాన్ శక్తి సంఘం), డా॥ కె ఎస్ సుబ్రమణ్యన్ (రిటైర్డు ఐపిఎస్ మాజీ డిజిపి, త్రిపుర), ప్రొఫెసర్ ఘనశ్యామ్ షా (ప్రొఫెసర్, సోషల్ సైన్సెస్ ఇన్ కమ్యూనిటీ హెల్త్, జెఎన్‌యు), తనిక సర్కార్(హిస్టరీ ప్రొఫెసర్ జెఎన్‌యు) సభ్యులుగా వున్నారు. ఈ ట్రిబ్యునల్ అనేక వ్యయ ప్రయాసల కోర్చి నిష్పాక్షికంగా విచారణ జరిపి 2,094 మౌఖిక, లిఖిత పూర్వక సాక్ష్యాధారాలతో సమగ్రమైన ఒక నివేదికను రూపొందించింది. ఆంగ్లంలో వున్న ఆ నివేదికను ప్రజాశక్తి పుస్తక ప్రచురణాలయం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారు క్లుప్తీకరించి తెలుగులోకి అనువదించారు. 125 పేజీలతో కూడిన ఈ పుస్తకంలో ఎంతో అమూల్యమైన సమాచారం వుంది.

గోద్రా సంఘటన ఎందుకు జరిగింది? దానిని కావాలనే జరగనిచ్చారా? వంటి ప్రశ్నలు నేడు యావత్ దేశాన్ని వేధిస్తున్నాయి. అలాగే హింస చెలరేగిన ప్రాంతాలు, గోద్రా అనంతర ఊచకోత సంఘటనలు, హింసాకాండ తీరు తెన్నులు, మహిళలపై అల్లరి మూకలు విరుచుకు పడిన తీరు, నేరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం, పోలీసుల పక్షపాత వైఖరి, సహాయ పునరావాస కార్యక్రమాల్లో వివక్ష, పత్రికలు, ప్రసార మాధ్యమాల పాత్రపై ట్రిబ్యునల్ లోతుగా విచారణ జరిపి సమగ్రమైన నివేదికను రూపొందించింది. ఇందులో హృదయాన్ని కదిలించే తీర్మానాలున్నాయి. తప్పులను దిద్దే పలు సిఫారసులున్నాయి. దోషులను రాజ్యాంగం ప్రకారం శిక్షించి, బాధితులకు పునరావాసం కల్పించే ప్రతిపాదనలున్నాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల సమాచార హక్కు అత్యంత ఉత్కృష్టమైనది. ఈ ప్రాథమిక హక్కును గౌరవించే ఏ ప్రభుత్వమైనా విచారణ జరిపే పౌర ట్రిబ్యునల్ ప్రయత్నాలకు తన సంపూర్ణ మద్దతు అందజేస్తుంది. కానీ గుజరాత్‌లోని మోడీ ప్రభుత్వం దీనికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. సమాచారాన్ని దాచేందుకు ప్రయత్నించింది. దీనికి కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వం వత్తాసు పలికింది.



మానవతపై దాడి

గుజరాత్ మారణకాండపై విచారణ నివేదిక

(పౌర ప్రతిస్పందన వేదిక)

తెలుగు : గౌతమ్, వెల: రు.30

ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్

(గుడిమల్కాపూర్)

ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

గుజరాత్ మారణకాండకు సంబంధించి తీసిన డాక్యుమెంటరీల ప్రదర్శనను సైతం ఈ ప్రభుత్వాలు అడ్డుకున్నాయి. ఈ భయంకర మృత్యుకేళికి సాక్షాత్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు స్వయంగా నాయకత్వం వహించడమే దీనికి కారణం. ఊచకోత బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో ఉద్దేశపూర్వకంగానే మోడి ప్రభుత్వం ఉదాసీనతతో వ్యవహరించింది. సహాయక శిబిరాలను పిల్లలు ఉత్పత్తి చేసే కేంద్రాలుగా మోడీ అవహేళన చేయడాన్ని ట్రిబ్యునల్ తీవ్రంగా పరిగణించింది. గోద్రా, తదనంతర మారణకాండపై మీడియాలో ఒక సెక్షన్ వ్యవహరించిన తీరు చాలా దుర్మార్గమైనదని ట్రిబ్యునల్ ఆక్షేపించింది. గోద్రా విషాదం వెనక 'విదేశీ హస్తం' వుందన్న నిరాధారమైన అధికారిక కథనాన్ని గుజరాత్ సమాచార్, సందేశ్ అనే రెండు గుజరాతీ పత్రికలు 2002 ఫిబ్రవరి 28న ప్రముఖంగా ప్రచురించాయి. అత్యధిక సర్కులేషన్‌తో ఒకేసారి అనేక ప్రాంతాల నుంచి వెలువడే ఈ పత్రికల ద్వారా ప్రచురితమైన 'విదేశీ హస్తం' కథనం వట్టి బూటకమని మూడు, నాలుగు వారాల అనంతరం తిరిగి వార్తలు వెలువడ్డాయి. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. 'యాభై మంది హిందువులను సజీవంగా తగుల బెట్టారు' అనే శీర్షికతో గోద్రా సంఘటనలో చనిపోయినవారి గగుర్పాటు కలిగించే మృతదేహాలను సందేశ్ పత్రిక రంగుల్లో విస్తృతంగా ప్రచురించింది. ఈ పత్రిక వార్తా కథనాన్ని ఫోటో కాపీలు తీసుకుని ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, బజరంగ్ దళ్ కార్యకర్తలు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం విస్తృతంగా పంచిపెట్టి సాధారణ ప్రజలు ఊచకోతలో పాలుపంచుకునే విధంగా రెచ్చగొట్టారని సాక్షులు ట్రిబ్యునల్‌కు వివరించారు. ఎడిటర్స్ గిల్డ్ కూడా ఈ పత్రికల వ్యవహార తీరు పట్ల ఆక్షేపణ తెలియజేసింది.

లౌకిక ఐకమత్యంలోని మాధుర్యం, మత సామరస్యం లోని సౌందర్యం, భారతీయ మానవతకు ప్రతీక అయిన సెక్యులరిజం ఇదే జాతికి నిరంతర కార్యక్రమంగా వుండాలని ట్రిబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ విఆర్ కృష్ణ అయ్యర్ పేర్కొన్న మాటలు సర్వదా శిరోధార్యం. గుజరాత్ మారణ కాండ గురించి సమగ్రమైన, సాధికారిక నివేదికగా దీనిని పేర్కొనవచ్చు. గుజరాత్ మారణ హోమం గురించి తెలుసుకోదలచిన వారికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ●

అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మెదక్ చర్చి

ఒకనాడు మెతుకుసీమగా ప్రసిద్ధి పొందిన మెదక్ జిల్లాలో పర్యాటకులు చూడవలసిన ఎన్నో చారిత్రక, పర్యాటక స్థలాలు ఉన్నాయి. ఆసియాలో రెండవ అతి ఎత్తైన చర్చిగా మెదక్ చర్చి ప్రసిద్ధి కెక్కింది. ఈ చర్చి వల్లనే మెదక్ దర్శనీయ పట్టణంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. ఇంగ్లాండ్‌కు చెందిన రెడరెండ్ చార్లెస్ వాకర్ పాస్నెట్ ఈ అద్భుత నిర్మాణానికి రూపకల్పన చేశారు. 1914లో దీని నిర్మాణం పదేళ్ళ పాటు కొనసాగింది. దేశ దేశాల శిల్పులు దీని నిర్మాణంలో పాలు పంచుకున్నారు. చర్చి ప్రధాన ప్రార్థనా మందిరం ఎత్తు 53 మీటర్లు, పొడవు 91 మీటర్లు, వెడల్పు 45 మీటర్లు ఉంది. ఒకేసారి ఐదు వేల మంది ఇందులో ప్రార్థన చేసుకోవచ్చు. విశాలమైన స్థలంలో ఉన్న ఈ చర్చికి క్రిస్మస్ రోజు దాదాపు 50 వేల మంది వస్తారు. దీని నిర్మాణ కౌశలం చూపరులను ఎంతగానో ఆకర్షిస్తుంది.

కొండాపూర్

దక్షిణ తక్షశిలగా పేరొందిన కొండాపూర్ ఈ జిల్లాలోనే ఉంది. ఆంగ్లేయుడైన పురాతత్వవేత్త హెన్రీ కౌజెన్సు కొండాపూర్‌లోని ప్రాచీన మట్టిదిబ్బను తవ్వి చూడగా అక్కడ పాతరాతి, కొత్తరాతి యుగానికి చెందిన, క్రీస్తుపూర్వం వాడిన అనేక రాతి, మట్టి పనిముట్లు దొరికాయి. 1940-42 సంవత్సరాల్లో జరిపిన తవ్వకాల్లో అనేక శిధిలమైన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, విహారాలు, చైత్య మండపాలు కనిపించాయి. ప్రాచీన నాగరికత, బౌద్ధం విరాజిల్లిన ఈ ప్రాంతం నేడు ప్రభుత్వ నిరాదరణకు గురయింది. పాతరాతియుగం నుండి అన్ని నాగరికతలను చూసిన కొండాపూర్‌లో దొరికిన ప్రాచీన వస్తువులను స్థానిక మ్యూజియంలో భద్రపరిచారు. అయితే ప్రచారం లేనందువల్ల పెద్దగా ఆదరణ పొందటం లేదు.

ఏడుపాయలు

మెదక్‌కు ఈశాన్యంగా ఏడుపాయలు అనే గ్రామం ఉంది. మంజీర నదికి చెందిన ఏడు ఉపనదులు ఇక్కడ సంగమం చెందుతాయి. ఈ దృశ్యం చూడటానికి ఎంతో మనోహరంగా ఉంటుంది. మహాశివరాత్రి నాడు ఇక్కడ పెద్ద జాతర జరుగుతుంది. దీన్ని తిలకించడానికి కనీసం లక్షమంది యాత్రికులు వస్తారు. దీన్నే ఏడు పాయల జాతర అంటారు.

పాండవుల గుట్ట

రేగొండ మండలం తిర్మలగిరి గ్రామ శివార్లలో ఉన్న అడవులతో కూడిన గుట్టలకు పాండవుల గుట్టగా పేరొచ్చింది. చుట్టూ గుట్టలు, మధ్యలో లోయ ప్రాంతం, చెరువులు, పొలాలు, సమావేశ గుహ, రక్షణ కవచం తదితరాలతో ఎంతో మనోహరంగా ఉంటుంది. పాండవులు అరణ్యవాసాన్ని ఇక్కడే గడిపారని స్థానికుల విశ్వాసం. గుట్టలపై గల అనేక చిత్రాలు కూడా వారి విశ్వాసానికి ఊపిరి పోస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా గుర్తించిన ప్రభుత్వం నిధులు వెచ్చించి పనులు చేస్తోంది.

నర్సాపూర్ అడవులు

ఈ జిల్లాలోని నర్సాపూర్ వద్ద గల అడవులు పర్యాటక ప్రాంతంగా బాగా అభివృద్ధి చెందాయి. ఇక్కడి సహజ సిద్ధమైన వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అడవులు నేపథ్యంగా గల అనేక సినిమాలు ఇక్కడే షూటింగ్ జరుపుకున్నాయి. ఏడాది పొడవునా ఈ అడవుల్లో షూటింగులు జరుగుతూనే ఉంటాయి. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం, రవాణా సదుపాయాలు కూడా ఉండటంతో పర్యాటకులు ఈ ప్రాంతాన్ని ఎంతగానో ఇష్టపడతారు. హైదరాబాద్ నగర దాహార్తి తీరుస్తున్న సింగూర్ రిజర్వాయర్ మంజీరాపై నిర్మించారు. ఇది కూడా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ●

* డా॥ బీరం సుందరరావు



అక్షర విజేత అడిగోపుల వెంకటరత్నమ్

"కవిత కోటి గొంతుకల్ని
తోరణంగా మలిచే మార్గం
కోటి వీణల్ని ఒకే శ్రుతిలో
పలికించే రాగం"

మనిషి కేంద్ర బిందువుగా రాసేదే అసలైన కవిత్వం. కవిత్వంలో మనిషి ప్రవహించాలి. పరిమళించాలి. రాగమై రవళించాలి. కవిత్వానికి ఉన్నతస్థానం కల్పించి, కవిత్వాన్ని తన నరాల తీగల మీద స్వరాలుగా పలికిస్తున్న నిరంతర కవి అడిగోపుల వెంకటరత్నమ్. మట్టిని ప్రేమించే కవి. వస్తుదృష్టి ఉన్న కవి. సామాజిక నిబద్ధత ఉన్న కవి మార్గాన్ని నిర్దేశించుకొని, ఆ మార్గాన్ని మహాపథం చేసుకుని ప్రస్థానం సాగిస్తున్న కవి. వెంకటరత్నమ్‌కు మరణానికి రెండు ముఖాలు ఎలా వుంటాయో తెలుసు. నిజ జీవితంలోనూ నిజాయితీగా జీవన పోరాటం సాగించే వారికి యుద్ధమంటే భయం లేదు. పురోగమనం అంచున పయనించేవాడే నిజమైన కవి. కాని బానిసత్వాన్ని సైతం బాహాటంగా విక్రయించే ఈ దేశంలో ఎప్పటికీ సూర్యోదయం కాదని అడిగోపుల కలానికి తెలుసు. అడిగోపుల ఆశావాది.

అడిగోపుల మాటల్లోనే చెప్పాలంటే కవి కవిత్వానికి కాపలాదారుడు కావాలి. ఇవాళ కావాల్సింది. జోకొట్టే కవిత్వం కాదు, జెకొట్టే కవిత్వం అంటాడు. కవిత్వం మనిషి చేతి ఆయుధం కావాలంటాడు.

"చావుకు భయపడిన చోట
క్రూరులదే పై చేయి
ఎదిరించి పోరాడిన చోట
వీరులదే పై చేయి" – అంటూ ప్రతిఘటన చైతన్యాన్ని పండిస్తాడు అడిగోపుల. చరిత్ర చదివితే ప్రతిఘటన విప్లవానికి పురిటిగది అని తెలుస్తుంది. వెంకటరత్నమ్ విప్లవవీరుడి అంతరంగాన్ని ఆవిష్కరించిన తీరు చూడండి –

"విప్లవ వీరుడు మరణించడు
జైల్లో అతని మెదడులో జీవనదులు ప్రవహిస్తాయి.
జలపాతాలు హోరెత్తుతాయి
అందరం మరణించినా
అతడొక్కడే చిరంజీవి"– అంటాడు.

కవిత్వం నిజ జీవితంలోని అడ్డుగోడల్ని తొలగించి, జీవితం నుండి లభించే స్పందనను సార్వజనీనం చేయాలి. ఎందుకంటే జీవిత పరిధి కంటే కవిత్వం పరిధి ఎక్కువ. కవిత్వం జీవితాన్ని వ్యాఖ్యానించాలి. బతుక్కి భాష్యం చెప్పాలి. జీవితాంతం జ్ఞాపకమై వెంటాడాలి. కరచాలనం చేసి కర్తవ్యాన్ని బోధించాలి.

"మనది బల్లకట్టు ప్రయాణం
మనది సామూహిక మరణం.
మనది ఎక్స్‌గ్రేషియా బతుకు" అంటూ వర్తమాన సమాజంలోని మనిషి జీవితం మూలల్లోకి వెళ్తాడు. ఇంతవరకు ఏ కవైనా చెప్పగలడు. కాని వెంకటరత్నమ్ స్టేట్‌మెంట్ ఇచ్చి చేతులు దులుపుకునే కవి కాదు. ఆలోచననందిస్తాడు. దాన్ని ఆచరణలో పెట్టమంటాడు.

"ఉరికొయ్యల సముదాయాన్ని
ఒక్కుమ్మడిగా ఉరితీసే
పోటెత్తిన పిడికిళ్లివి"– అంటూ నెత్తురుమండే శక్తులు నిండే యువరక్తాన్ని ఆహ్వానించాడు. కనుకనే అడిగోపుల దృష్టిలో మనిషి ఒక మహాయుధం విస్తరించిన మహాపథం.

కవిత్వం రాయడానికి సిన్సియారిటీ, సీరియస్‌నెస్ రెండూ ముఖ్యం. కవిత్వాన్ని కాలక్షేపంగా గాక, కాలమేఘగర్జనలా విన్పించే కవి అడిగోపుల.

"కాటువేయడానికి స్వేచ్ఛ ఉన్నప్పుడు
కత్తిఝుళిపించడానికీ హక్కు వుంది.
పొట్టనింపుకోను గడప దాటుతున్నావు
కొంగుమాటున కత్తి దాచుకోవమ్మా"– అంటూ స్త్రీలోకానికి కర్తవ్యోపదేశం చేశాడాయన. సామాజిక నేపథ్యం నుండి వస్తువును ఏరుకున్న కవి వాస్తవాన్ని చెప్పి, అంతిమంగా కర్తవ్యాన్ని బోధిస్తాడు. కాలం చెక్కిలిమీద కన్నీటి చారికల్ని తుడిచి, కొత్త రక్తాన్ని ఇంజక్ట్ చేయాలి. కవికి కావాల్సింది స్పందన, సహృదయత, సామాజిక దృష్టి, ఈతరం కవుల్లో పంటచేను లాంటి కవి వెంకటరత్నమ్. ఆయన కవిత్వంలో ఆర్ద్రత ఉంటుంది. ఆర్తి కన్పిస్తుంది.

"వేసిన మొగ్గలన్నీ పూతగా
రాలడం చూస్తేనే మనసు క్షోభించేది
లేచిన అలలు చెలియకట్ట దాటకుండా
సమాధి అయితేనే హృదయం ద్రవించేది"

కవి స్వీయానుభవం సామాజిక అనుభవంగా పరిణమించడమంటే ఇదే. పై నాలుగు పాదాల్లో వెంకటరత్నమ్ ఎంతటి చైతన్యాన్ని పండించారో పాఠకుడు ఇట్టే పసిగట్టగలడు. మనిషి భవిష్యత్తు ఎంతగా భగ్నమైపోతుందో, లోకాన్ని ఏలవలసిన చిట్టి అడుగులు ఎలా ఛిద్రమై పోతున్నాయో సూచ్యం చేశారు. వెంకటరత్నమ్, భాషకంటే భావుకతకు వర్ణనకంటే వాస్తవికతను ఇష్టపడే కవి ఆయన. వారిది కల్లాకపటం లేని కవిత్వం.

"ఎట్టకేలకు నాచూపు
సూది రంధ్రాన్ని జయించింది
కానీ
నా అతుకులబొంత
సూదిని ఓడించింది"– జీవిత వాస్తవాన్ని, ఒక సామాజిక సత్యాన్ని, ఒక దుఃఖ పార్శ్వాన్ని ఇంతకంటే సులభమైన మాటల్లో సంక్షిప్తంగా, తీక్షణంగా చెప్పగలరా ఎవరైనా ? ఒక నిరుపేద–వృద్ధ నిరుపేద జీవితాన్ని ఇంతకంటే బలీయంగా దృశ్యమానం చేయగలరా ? మామూలు మాటల్ని కూడా కవిత్వమయం చేయగలవాడే నిజమైన కవి. ఈ శక్తి వెంకటరత్నమ్‌కు పుష్కలంగా వుంది.

"మనిషి చిరంజీవి
మనసు సంజీవి"
"ఎన్ని చేతులు శ్రమించాయో
ఒక రోజుగా మారడానికి"

"తరలివచ్చిన మేఘాలు
ఎండవేడికి ఒళ్ళుకాలి
ఆకాశపు అంచుగూళ్ళలో దాక్కుంటాయి"
"చినుకుల సిల్కు దారాలతో
నింగి నేలకలసినట్లు
వర్షం కురుస్తోంది"

"బాధ్యత తెలియని తండ్రికి
బాధ్యత తెలిసిన కొడుకే తండ్రి"

ఇలాంటి ఎన్నో సామాజిక వాస్తవ దృశాలను అక్షరాల్లో బొమ్మకట్టించడం అడిగోపులకు బాగా తెలుసు. శైలి, నిబద్ధత, సామాజిక సందేశం వగైరాలు. ఉత్తమ కవిత్వం ఏ రూపంలో వున్నా గుర్తింపు పొందుతుంది.

"కలం పాతదే కొత్త మార్గం రాస్తుంది
అలపాతదే కొత్తరాగం తీస్తుంది
చెట్టుపాతదే కొత్త చిగురు వేస్తుంది"- అంటాడు వెంకటరత్నమ్. ఇందులోని కవి అంతరంగం ఏమిటో ఇట్టే తెలుసుకోవచ్చు. మూడు దశాబ్దాలుగా రాస్తున్న వెంకటరత్నమ్ కలం కాలానుగుణంగా కొత్తపుంతలు తొక్కుతూనే వుంది. కొత్త వస్తువుల్ని ఏరుకుంటూ, కొత్త ఉదయాల్ని ఆవిష్కరిస్తూనే వుంది. సరికొత్త ఊహల్ని దానం చేస్తూనే వుంది. జీవితం మూలాల్లోంచి కవిత్వ మూల్యాలను అందిస్తూనే వుంది.

చెప్పే వస్తువు మీద అధారిటీ వున్న కవి. అమ్మను గురించి ఎంత గొప్పగా రాయగలడో అనాధను గురించీ అంత గొప్పగా చెప్పగలడు. విప్లవ వీరుణ్ణీ, వీధిగాయకుణ్ణీ తన కవిత్వంలో అమరుల్ని చేయగలడు.

"అడగడానికి చెప్పడానికి మధ్య
అమ్మచూపు ఆగిపోయింది.
అమ్మ రూపాన్ని
నాటి నుండి అడుగడుగునా వెతుక్కుంటున్నాను
ఎప్పుడైనా ఎక్కడైనా
బక్కపల్చని ఓ అమ్మ
కట్టె మోపుతో కనిపిస్తే
తక్షణం ఆమె నెత్తి మోపు కొనేస్తాను" అంటాడు అడిగోపుల, అమ్మ హృదయం తెలియని వాడు అమ్మను గురించి రాయలేడు.

కన్నీళ్ళు తెప్పించే ముగింపుతో అమ్మను ఆవిష్కరించిన వెంకటరత్నమ్‌ను అమ్మ మనసుతో అభినందించక తప్పదు.

"చావు పుట్టకల మధ్య
పద్దెనిమిది పర్వాల బతుకు స్త్రీది
అమ్మ భాషనూ ఆడదాని బాధనూ
ఆవిష్కరించే కవిత్రయం ఏది?" అనే వెంకటరత్నమ్ ప్రశ్నకు అమ్మై పుడితే తప్ప మనం జవాబు చెప్పలేం.

ఒక మంచి పోయెమ్ రాయాలంటే కవి ముందుగా వస్తువుతో మమైక్యం కావాలి. తనను తాను సింప్లిఫై చేసుకోవాలి. ఆవేదన చెందాలి. అక్షరంగా మారాలి. "గాయపడిన హృదయం నుండే ఉన్నతోన్నత భావాలు వెలువడుతాయి" అంటాడు మాథ్యూ ఆర్నాల్డ్. వెంకటరత్నమ్‌కు గాయపడటం తెలుసు. గాయానికి కట్టు కట్టడమూ తెలుసు. అందుకే ఆయన హిపోక్రసీ లేని కవి. నిబద్ధత, నిజాయితీ కల్గిన కవి. జీవితం నుండి అతని కవిత్వాన్ని విడదీసి చూడలేం. వెంకటరత్నమ్ వెలుతురు దీపాన్ని వెలిగించిన కవి. కవిత్వం ఎంత గొప్పదయినా జీవితాన్ని వ్యాఖ్యానించకపోతే నిరుపయోగం అంటారు. అరుద్ర. ఆరుద్రను అమితంగా అభిమానించే అడిగోపులకు జీవితమే కవిత్వం. కవిత్వమే జీవితం. అందుకే ఆయన అక్షర విజేత అయ్యాడు. ●

నడత తప్పిన నడక

హద్దులు మరిచి పక్షి
స్వేచ్ఛా విహారానికి వీల్లేదు
మాటు వేసిన వేటగాళ్ళు
ప్రమాదం పొంచి వుంది!
నీటిలో చేపల ఎదురీతలు
ఎగిరెగిరి గంతులు చెల్లవు
ఒడ్డుపై గాలం వెంటాడుతూ
వేటాడుతూ వుంది!
అర్థరాత్రి అపరాత్రులే కాదు
పట్టపగలూ పయనం ప్రమాదం
రోడ్లు విస్ఫోటనాలై
అడుగడుగునా కళేబరాలు!
దప్పిక గొన్న ఒంటె
ఎడారిలో ఆగివుంది
ఒయాసిస్సు నీటిపై అనుమానం
బేహారికే కాదు
ఎడారి ఓడకూ పట్టుకుంది!



ధర్మాసుపత్రిలో
పసిబిడ్డల మార్పిడి
ఒక తల్లి బిడ్డకు
తల్లిగాని తల్లైన ఘటనలు!
ప్రాణానికి ప్రాణం పోసే సెలైన్
చీకటితో చెలిమి చేసి
ద్రోహంతో చేయి కలిపి
ప్రాణం తీసే ఎత్తుగడలు!
నడవ కూడని దారిన
నడత నడుస్తూ
మనుగడే ధ్యేయమై
మానవత చంపుకుంది!
కాలం కాలుజారి
నెల తప్పుతూ
నెలలు నిండని గర్భం
ప్రసవంపై ప్రసవం!

– అడిగోపుల వెంకటరత్నమ్

ADVOCATE

న్యాయసలహాలు

భర్త నుండి రక్షణ కావాలి

నా పేరు గీత. డబ్బులు ఉన్న వాళ్ళని నన్ను ఒక రాక్షసుడికి ఇచ్చి పెళ్ళి చేశారు. అయినా ఏమి చేయగలను. భారతదేశ సంప్రదాయంలో భర్త ఎలాంటి వాడైనా భార్య సర్దుకుపోవాలి. నా పరిస్థితీ అంతే. ఒకటి కాదు, రెండు కాదు 9 సంవత్సరాలు సర్దుకు సర్దుకుపోయాను. ఇద్దరు పిల్లలు పుట్టారు. సహనానికి ఒక హద్దు ఉంటుంది. అయినా నేను ఎక్కువగానే సహించాను. నాలోనూ సహనం చచ్చిపోయి, ఇక వాడితో కలిసి జీవించలేక విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకొని, నా పిల్లలతో బ్రతుకుతున్నాను. 3 సంవత్సరాల నుండి నా విడాకుల కేసు కోర్టులోనే ఉంది. అలాంటి దుర్మార్గుడి నుండి విడిపోవాలన్నా సాధ్యం కావడం లేదు. వాడు విడాకులు ఇవ్వనంటున్నాడు. ఈ కేసుకు ఎన్నో అడ్డంకులు కల్పిస్తున్నాడు. పెద్దల ద్వారా రాజీకి వచ్చాడు. ఇంటిమీద దాడి చేసి కొట్టాడు.

ఏ నాటికైనా నన్ను చంపుతానని, ఇపుడు కేసు దాదాపు ముగింపుకు వచ్చిందని తెలిసి మరీ రెచ్చిపోతున్నాడు. కోర్టు ఆవరణలోనే నన్ను బెదిరిస్తున్నాడు. ఏ దిక్కూ లేని నా పరిస్థితి ఏమిటి? ఒకవేళ వాడు నన్ను చంపితే నా పిల్లల పరిస్థితి ఏమిటి?

నేను మనస్ఫూర్తిగా ఆ దుర్మార్గుడి నుండి విడిపోవాలనుకుంటున్నాను. నాకు విడాకులు కావాలి. అలాగే నా పిల్లలూ నాకు కావాలి. వారిని నేనే పోషించుకుంటాను. వాడి నుండి నాకు ఏ విధమైన పరిహారమూ అవసరం లేదు. అలాగే వాడి నుండి రక్షణ కావాలి. ఎలా? దయ చేసి సలహా ఇవ్వగలరు.

- గీత

మీ హృదయ విదారకమైన స్థితి మన భారతదేశ సగటు స్త్రీ మనస్తత్వం పరిధిని సూచిస్తున్నది. స్త్రీ అంటే అబల కాదు సబల అని నిరూపించుకోవాలి గాని పరిస్థితులకు భయపడి తలొగ్గకూడదు. 'భయపడుతుంటే ఎవరైనా భయపెడతారు. మీరు ఎదురుతిరిగితే తోక ముడుస్తారు' మీరు మీ పరిస్థితులను ఇంత వివరంగా రాసి మీ దగ్గరలోని మహిళా కౌన్సిలింగ్ వారిని సంప్రదించండి. పోలీసు వారి సహకారం అర్థించండి. అతనిపైన మిమ్మల్ని కొట్టిన క్రిమినల్ కేసులున్నా మళ్లీ భయపెట్టడానికి చూస్తున్నాడంటే సమాజానికి, మంచికి భయపడని అతడు మీరు చెప్పినట్లు శాడిస్టు కావచ్చు. మీరు విడాకులు కోరుకుంటూ వేసిన కేసు మూడు సంవత్సరాలు అయ్యిందంటే బహుశా అది చివరి దశలో ఉంటుంది. విడాకులు భర్త కోరితే త్వరగా రావు కాని భార్య పొందాలనుకుంటే త్వరగా వస్తాయి. బహుశా మీకు త్వరలో న్యాయం జరుగుతుంది. కోర్టులకుండే పని వత్తిడుల వల్ల మూడు సంవత్సరాలు అంటే ఎక్కువ సమయమేం కాదు. అలాంటి ఆలస్యాన్ని కూడా తగ్గించడానికి ప్రస్తుతం మన దేశంలో 'ఫాస్ట్‌ట్రాక్' కోర్టులని అవి త్వరగా పరిష్కరించే న్యాయస్థానాలని స్థాపించారు. మీరు భరణం కూడా పొందవచ్చు. అదీ వద్దంటున్నారు. అతడి నుండి రక్షణ కావాలని మీరు న్యాయస్థానంలో చెప్పండి. న్యాయమూర్తిగారే పోలీసులకు ఆ దిశగా ఉత్తర్వులిస్తారు. లేదా మీరైనా మీకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లోగాని, ఇంకా ఉన్నతాధికారికిగాని మీ పరిస్థితి వివరించండి. తప్పక మీరు రక్షణ పొందగలరు.

నష్టపరిహారం ప్రభుత్వ రేటు ప్రకారం ఇస్తారా?

మాది మేజర్ పంచాయితీ గ్రామం. మాకు రెండు ఎకరాల మెట్ట పొలం. ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఇపుడు ఈ స్థలాన్ని ప్రభుత్వం పేద వారికి ఇళ్ళ స్థలాల నిమిత్తం సేకరించే ఉద్దేశంలో ఉంది. అలా సేకరించితే మాకు ఏ విధంగా నష్టపరిహారం చెల్లిస్తారు? ఈ మధ్యనే మా పొలంలో 5 సెంట్ల స్థలాన్ని చదరపు గజం రు. 200/- చొప్పున మేము అమ్మడం జరిగింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం మా పొలం విలువ ఎకరం రు. 80,000 కలదు. ఇప్పుడు ప్రభుత్వం మా పొలం తీసుకుంటే మాకు పై చదరపు గజం విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లిస్తారా? లేదా? మా పొలాన్ని గ్రామ కంఠంలోని నివేశన స్థలంగా మార్చుకోవాలంటే ఎలా? అలా మార్చాలంటే కుదురుతుందా? ఎవరిని సంప్రదించాలి ? పొలంలో గల 10 సెంట్ల స్థలాన్ని ఐదుగురు వ్యక్తులు ఆక్రమించుకొని ఇళ్ళు కట్టుకుని, ఇళ్ళ పన్నులు చెల్లిస్తూ గత 30 సంవత్సరాలుగా ఉంటున్నారు. వాళ్ళు కట్టుకున్న ఇళ్ళు పంచాయితీ గ్రామ కంఠంలో చేరినవి. వాళ్ళు ఆక్రమించి ఇళ్ళు కట్టుకున్నది మా పొలంలో కనుక, మా యొక్క మిగిలిన స్థలం కూడా గ్రామ కంఠంలోకి వస్తుందా? వస్తే గ్రామ కంఠపు ప్రభుత్వ రేటు ప్రకారం నష్టపరిహారం ఇస్తారా? ఒకవేళ రాకపోతే, రావాలంటే ఏం చెయ్యాలి? దయచేసి తగిన సలహాను ఇవ్వగలరు.

- ఎ.శ్రీనివాసరావు, మంగవరం.

మీకు రెండెకరాలే ఉందన్నారు. రెండెకరాల సన్నకారు రైతు యొక్క భూములు ప్రభుత్వం సేకరించదు. మీ గ్రామ పరిస్థితిని బట్టి అదే అనువుగా ఉందనుకుంటే అది తీసుకుని అదే మొత్తంలో మీకు అక్కడికి దగ్గరలోని ఏదైనా ప్రభుత్వ భూమి ఉంటే అది మీకు ఇచ్చి మీ భూమి తీసుకుంటారు. అలాంటి భూమి లేదంటే నష్టపరిహారంగా ప్రత్యేక అధికారి మీకు నోటీసు జారీ చేసిన నాటి మార్కెట్ విలువను అనగా తాను పరిశీలించిన వాస్తవ ధరను నిర్ణయిస్తాడు. ఆ ధర మీకు నచ్చకపోతే సబ్ కోర్టులో దానిని పెంచమని దావా వేయవచ్చు. ఆ దావాలో మీరు గ్రామంలోని పరిస్థితులు, ధరలు, సాక్ష్యాలతో సహా నిరూపిస్తే మీరు సరైన ధర పొందగలుగుతారు. మీ పొలాన్ని మీరు నివేశిత స్థలంగా మార్చాలనుకుంటే సంబంధిత గ్రామ పంచాయితీలో మీరు దరఖాస్తు చేసుకొని మీరు 'లేఅవుట్'ని జతపరుస్తూ ఆమోదింప చేసుకుంటే మీరు మీ భూమిని ప్లాట్‌లుగా మార్చుకోవచ్చు. మీ పొలాన్ని ఇతరులు ఆక్రమించుకుని ఇండ్లు కట్టుకున్నారంటున్నారు. పన్నులు కూడా వారే చెల్లిస్తూ 30 సంవత్సరాలుగా ఉంటున్నారన్నారు. వారు ఆక్రమించిన ఇండ్ల వరకే పన్నులు కూడా కడుతున్నారంటే ఇంటి నెంబరు వచ్చి ఉంటుంది. గ్రామంలోకి వస్తుంది. కాని మీ పేరిట పట్టాగల భూములు గ్రామకంఠంలోకి రావు. మీరు గ్రామ పంచాయితీ అధికారిని కలిసి గ్రామం యొక్క 'నక్ష' చూడండి. దాంట్లో గ్రామ కంఠంలో మీ భూమి ఉన్నదా? లేదా అనే విషయం తెలుస్తుంది.

- గుండ్లపల్లి లక్ష్మీనరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

టమాటా రైస్

కావలసిన వస్తువులు:

అన్నం: అరకిలో బియ్యంతో వండినది
టమాటాలు: 100 గ్రాములు
క్యారెట్లు: రెండు
లవంగాలు: నాలుగు
అనాసపువ్వు: కొద్దిగా
బిరియానీ ఆకు: తగినంత
అల్లం, వెల్లుల్లి ముద్ద: ఒక స్పూను
పచ్చిమిర్చి: నాలుగు
ఉల్లిపాయ: ఒకటి
డాల్డా లేదా నెయ్యి: 30 గ్రాములు
ఉప్పు: తగినంత

చేసే విధానం:

ముందుగా అన్నం పొడిపొడిగా ఉండేలా వండుకోవాలి. టమాటాలు, క్యారెట్లు, పచ్చి మిరపకాయలు, ఉల్లిపాయను తరిగి ఉంచుకోవాలి. బాండీలో తగినంత నెయ్యి లేదా డాల్డా వేయాలి. అది కాగిన తరువాత లవంగాలు, అనాస పువ్వు, బిరియానీ ఆకు వేసి కొద్దిగా వేయించాలి. అందులో అల్లం, వెల్లుల్లి పేస్టు వేసి వేగిన తరువాత ఉల్లిపాయ, పచ్చి మిరపకాయ, క్యారెట్ ముక్కలను వేయాలి. అవి వేగిన తరువాత టమాటా ముక్కలను వేసి కొంచెం వేగనివ్వాలి. ఇప్పుడు అన్నం కలపాలి. అందులో తగినంత ఉప్పు కూడా వేసి కలపాలి. ఎప్పుడైనా అనుకోకుండా అన్నం ఎక్కువగా మిగిలిపోయినా ఇలా చేసుకోవచ్చు.

పెద్ద బూందీ లడ్డు

కావలసిన వస్తువులు:

శనగపిండి: 1 కేజీ
పంచదార: ఒకటిన్నర కేజీ
నూనె: 1 కేజీ
నెయ్యి: 50 గ్రాములు
జీడిపప్పు: 200 గ్రాములు
యాలకులు: ఐదారు

చేసే విధానం:

పంచదారను జిగురు పాకం వచ్చేలా పట్టుకొని పక్కన పెట్టుకోవాలి. అందులో నెయ్యి, యాలకుల పొడి కూడా కలపాలి. జీడిపప్పును కొంచెం నెయ్యి వేసి వేయించి పెట్టుకోవాలి. తరువాత శనగ పిండిని బూందీ దూసేందుకు వీలుగా కలుపుకోవాలి. ఇప్పుడు బాండీలో నూనె పోసి కాగిన తరువాత బూందీ దూసి దానిని ఎప్పటికప్పుడు పక్కన పెట్టుకున్న పాకంలో పోయాలి. రెండుమూడు వాయిల బూందీ పోసిన తరువాత కలుపుతూ ఉండాలి. బూందీ ఉడికితే చాలు. వేగే వరకు ఉంచకూడదు. మధ్యలో ఒకవేళ పాకం గట్టి పడితే కొద్దిగా వేడి చేస్తే మామూలుగా వస్తుంది. బూందీ మొత్తం దూయడం అయిన తరువాత అందులో జీడిపప్పు కూడా వేసి కలపాలి. ఇప్పుడు లడ్డూలు కట్టుకోవాలి. ఒక వేళ పాకం గట్టిపడి పోతే కొంచెం వేడినీళ్ళు పాకంపై చల్లితే లడ్డూ కట్టుకోవడానికి వీలుగా ఉంటుంది.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన
రైతువాణి
మాసపత్రిక

సంవత్సర చందా
రూ. 100/-
చందాదారులు కండి.
2004 మన రైతువాణి డైరీ,
క్యాలెండర్ ఉచితంగా
పొందండి.

వ్యవసాయరంగ
సంక్షోభానికి, రైతు నష్టాలకు
కారణాలను విశ్లేషించి
పరిష్కారాన్ని చూపేది
మన రైతువాణి

సంవత్సర చందాదారులకు మాత్రమే ఈ అవకాశం.

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతు సంఘం కార్యాలయాలలోగాని చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136 లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక